


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com




సంపుటి : 17 సంచిక : 186 | 14-08-2025 గురువారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00

## కాళేశ్వరం జలాశయాలు నింపండి

- వెంటనే మోటర్లు ఆన్ చేసి పంపింగ్ చేయాలి
- మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ



వార్త 3లో

## అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి దామోదర ఆదేశం

వార్త 3లో





## కుక్కల తరలింపు తీర్పు పరిశీలిస్తా

వార్త 2లో

అభ్యంతరాల నేపథ్యంలో సుప్రీం చీఫ్ జస్టిస్ వెల్లడి

కుక్కల తరలింపు అంశపై సుప్రీం చీఫ్ జస్టిస్ సానుకూలంగా స్పందించారు. దీనిని సమీక్షిస్తానని వెల్లడించారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.


## తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

- అధునాతన ప్యాకేజీ కంపెనీకి దక్కని అనుమతి
- కేంద్రం తీరుపై మంత్రి శ్రీధర్ బాబు అసహనం



వార్త 2లో

తెలంగాణకు వచ్చే కంపెనీలకు అనుమతి ఇచ్చే విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. ఏపీకి కొత్త ప్రాజెక్టులు కేటాయించి, తెలంగాణను మాత్రం పక్కన పెడుతోందన్నారు.



వార్త 2లో

## కంచగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరణ

తెలంగాణ ప్రభుత్వం చర్యలకు సుప్రీం అభినందన

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం సుప్రీంకోర్టులో మరోమారు విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది.

## సింధు జలాల ఒప్పందం ఆపితే తీవ్ర చర్యలు

- మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతాం
- మరోమారు పాక్ ప్రధాని ప్రేలాపనలు

సింధు జలాల ఒప్పందం నిలిపివేతతో అల్లాడిపోతున్న పాక్ నేతలు ఏం చేయాలో పాలుపోక నోటికి పని చెబుతున్నారు. యుద్ధోన్మాదంతో ఊగిపోతూ పిచ్చి ప్రేలాపనలకు దిగుతున్నారు. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌పై నోరు పారేసుకున్నారు. భారత్‌కు ఎన్నడూ మర్చిపోలేని గుణపాఠం చెబుతామంటూ హెచ్చరించారు.



వార్త 2లో

## గణేశ్ మండపాలన్నీ జియో ట్యాగ్

హైదారాబాద్ అక్షరకలం ప్రతినిధి

గణేశ్ నవరాత్రుల సందర్భంగా సెక్టార్ ఎస్ఐలు తమ పరిధిలో ఏర్పాటు- చేసిన మండపాల పూర్తి వివరాలు సేకరించి జియో ట్యాగింగ్ చేయాలని నగర సీపీ సీవీ ఆనంద్సూచించారు. మండపాల ఏర్పాటు- నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఇన్‌స్పెక్టర్‌లు మండపాల నిర్వాహకులతో తరచూ సమావేశాలు నిర్వహించి వారికి కావాల్సిన ఏర్పాట్లు- చేయాలని సూచించారు.





## సుప్రీంకోర్టు సంచలన తీర్పు

వార్త 2లో

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం రద్దు

కోదండరాం, అలీఖాన్ నియామకం చెల్లదు

గవర్నర్ నియామకంపై దాసోజ్ శ్రవణ్ పిటిషన్

తదుపరి విచారణ సెప్టెంబర్ 17కు వాయిదా



## రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీలో రద్దీ

- మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు
- అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు
- సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి

వార్త 2లో

# కంచగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరణ

## తెలంగాణ ప్రభుత్వం చర్యలకు సుప్రీం అభినందన

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం సుప్రీంకోర్టులో మరోమారు విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సమగ్ర ప్రణాళికను సమర్పించేందుకు ఆరు వారాలు గడువు కోరింది ప్రభుత్వం. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది సీజేఐ జస్టిస్ బీ.ఆర్ గవాయి ధర్మాసనం. అభివృద్ధికి తాము అడ్డుకాదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. సుస్థిర అభివృద్ధి ముఖ్యమని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. అభివృద్ధి చేసేటప్పుడు పర్యావరణ పరిరక్షణను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సూచించారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ చర్యలు మంచి ఫలితాలు ఇస్తే తప్పకుండా మెచ్చుకుంటామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా ఉపసంహరించుకొని మరింతగా ప్రశంసిస్తామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు.

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

## అధునాతన ప్యాకేజీ కంపెనీకి దక్కని అనుమతి

## కేంద్రం తీరుపై మంత్రి శ్రీధర్ బాబు అసహనం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణకు వచ్చే కంపెనీలకు అనుమతి ఇచ్చే విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. ఏపీకి కొత్త ప్రాజెక్టులు కేటాయించి, తెలంగాణను మాత్రం పక్కన పెడుతోందన్నారు. ప్రపంచస్థాయి అధునాతన ప్యాకేజింగ్ కంపెనీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఇందుకోసం మహేశ్వరంలో 10 ఎకరాల విలువైన భూమిని కేటాయించడంతో పాటు–, రాయితీలు ఇచ్చేందుకు ఆమోదిస్తూ అన్ని అనుమతులను రికార్డు స్థాయిలో పూర్తి చేశామన్నారు. అయినా కానీ, కేంద్ర క్యాబినెట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. ఏపీలో మాత్రం ఇలాంటి ప్రాజెక్టుకే కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. అయితే అక్కడ ఇప్పటివరకు ఎలాంటి భూకేటాయింపులు జరగలేదని, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైనా వారికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. కేంద్రం ఇలాంటి చర్యల వల్ల అంతర్జాతీయ పెట్టు–బడిదారులకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి రాజకీయ నిర్ణయాలు తెలంగాణ అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని, కేంద్ర వ్యవహారశైలిని రాష్ట్ర ప్రభుత్వం తూర్పారబడుతుందన్నారు.

# సింధు జలాల ఒప్పందం ఆపితే తీవ్రచర్యలు

## మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతాం

## మరోమారు పాక్ ప్రధాని ప్రేలాపనలు

ఇస్లామాబాద్, అక్షరకలం ప్రతినిధి

సింధు జలాల ఒప్పందం నిలిపివేతతో అల్లాడిపోతున్న పాక్ నేతలు ఏం చేయాలో పాలుపోక నోటికి పని చెబుతున్నారు. యుద్ధోన్మాదంతో ఊగిపోతూ పిచ్చి ప్రేలాపనలకు దిగుతున్నారు. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌పై నోరు పారేసుకున్నారు. భారత్‌కు ఎన్నడూ మర్చిపోలేని గుణపాఠం చెబుతామంటూ హెచ్చరించారు. నీటిని అడ్డుకుంటామంటూ బెదిరింపులకు దిగుతున్న ఈ శత్రువుకు నేను ఒకటే చెబుతున్నా.. మా నీటిలో మీరు ఒక్క చుక్కను కూడా తీసుకోలేరు. నీటిని అడ్డుకుంటున్నామంటూ మీరు బెదిరింపులకు దిగుతున్నారు. కానీ ఇలాంటి పని చేస్తే పాక్ మీకు ఎన్నటికీ మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతుందని వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని ఈ కామెంట్స్ చేశారు. సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందం పాక్‌కు జీవనాడి అని పాక్ ప్రధాని అన్నారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇటీవల పాక్ విదేశాంగ శాఖ.. ఒప్పందం అమలును కోరుతూ భారత్‌కు లేఖ రాసింది. 'సింధు నదీ జలాల ఒప్పందాన్ని ఎప్పటిలాగే అమలు చేయాలని భారత్‌ను కోరుతున్నాము. ఒప్పందానికి కట్టు–బడి బాధ్యతలు నిర్వర్తించాలని కోరుతున్నామని పాక్ విదేశాంగ శాఖ ఎక్స్ వేదికగా కూడా పోస్టు పెట్టింది. ఈ నేపథ్యంలో పాక్ ప్రధాని మళ్లీ రెచ్చిపోయారు. ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మరో నేత బిలావల్ భుట్టో కూడా భారత్‌పై యుద్ధోన్మాదంతో రెచ్చిపోతూ నోటికొచ్చినట్టు– మాట్లాడారు. భారత్‌ను ఉద్దేశిస్తూ మునీర్ అణుయుద్ధ హెచ్చరికలు చేశారు. పాక్ ఉనికికి ముప్పు వస్తే తమతో పాటు– సగం ప్రపంచం అంతమవు తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇక భారత్‌కు వ్యతిరేకంగా పాక్ ప్రజలు ఏకం కావాలని బిలావల్ భుట్టో పిలుపు నిచ్చారు.

# ఎపి హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల ప్రమాణం

అమరావతి,

ఎపి హైకోర్టు న్యాయమూర్తులుగా బుధవారం నలుగురు న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ నూనేపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్ లు ప్రమాణస్వీకారం చేశారు. వీరందరితో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సీజే నలుగురు న్యాయమూర్తులకు అభినందనలు తెలిపారు. జస్టిస్ కిరణ్మయి, హరినాథ్, సుమతి, విజయ్ లు 2023 అక్టోబర్ 21 న హైకోర్టు అదనపు న్యాయ మూర్తులుగా నియమితులయ్యారు. అయితే వారి పదవీ కాలం అక్టోబర్ 20 న ముగియనుంది. ఈ నేపథ్యంలోనే వారిని హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలంటూ ఇటీ–వల సుప్రీం కోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ఈ పరిణామంతో హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తుల సంఖ్య మొత్తం 24కి చేరింది.

# ఉచిత బస్సులతో మా బతుకులు రోడ్డున పడతాయి

## ఆటో డ్రైవర్లు ఆందోళన

కర్నూలు,

ప్రభుత్వ ఉచిత బస్సు నిర్ణయంతో ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న తమ బతుకులు రోడ్డున పడతాయని ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టిసి బస్సులో మహిళలకు ఉచిత ప్రాణాన్ని ఆటో సంఘాల తరపున స్వాగతిస్తున్నాం. ఆటో నడిస్తే తప్ప కుటుంబ పోషణ లేదు ప్రభుత్వ విధానం వల్ల ఉపాధి కోల్పోయి తమ కుటుంబాలు వీధిన పడతాయి ప్రభుత్వం తమను గుర్తించి అన్ని విధాల ఆదుకోవాలన్నారు. ప్రస్తుతం ఆటోలు ఎక్కేవారు తక్కువ అయ్యారు ప్రభుత్వ నిర్ణయంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారు. అప్పు చేసి మరి ఫైనాన్స్ తో ఆటోలను కొనుగోలు చేశామన్నారు. ఉచితం ప్రకటించడం వల్ల మా కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉంది జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం వెంటనే మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నాము

# కుక్కల తరలింపు తీర్పు పరిశీలిస్తా

## అభ్యంతరాల నేపథ్యలో సుప్రీం చీఫ్ జస్టిస్ వెల్లడి

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

కుక్కల తరలింపు అంశపై సుప్రీం చీఫ్ జస్టిస్ సానుకూలంగా స్పందించారు. దీనిని సమీక్షిస్తానని వెల్లడించారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీం తీర్పుపై జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపాయి. ఈ నేపథ్యంలో తీర్పు ఉత్తర్వులను తాను పరిశీలిస్తానని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వీధి కుక్కల దాడుల వల్ల ఢిల్లీ, ఎన్సీఆర్‌ల పరిధిలో రేబీస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ (ఉ॥కె)లో ఎక్కడా వీధి కుక్కలు ఉండటానికి వీల్లేదని స్పష్టంచేసింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని స్పష్టం చేసింది. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ అభ్యంతరం తెలిపారు. తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. ఢిల్లీలో 3 లక్షల వీధికుక్కలు ఉన్నాయి. వీటికోసం 3 వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో ఢిల్లీ ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. ఈ తీర్పు దశాబ్దాలుగా మనం అనుసరిస్తూ వచ్చిన మానవీయ, సైన్స్ ఆధారిత విధానాల నుంచి వెనకడుగు వేసినట్లుగా ఉందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. వీధి కుక్కలన్నింటినీ గంపగుత్తగా తొలగించాలన్న నిర్ణయం క్రూరమైనదని అన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ, ప్రముఖ సినీనటులు జాన్ అబ్రహాం, జాన్వీ కపూర్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ ఆనంద్, అడివి శేష్ తదితరులు వీధి కుక్కల సంరక్షణపై స్పందించారు. దీంతో చీఫ్ జస్టిస్ గవాయ్ పెద్ద మనసుతో ముందుకు వచ్చారు. తీర్పును సమీక్షిస్తానని ప్రకటించారు.

# సుప్రీంకోర్టు సంచలన తీర్పు

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం రద్దు

## కోదండరాం, అలీఖాన్ నియామకం చెల్లదు

## గవర్నర్ నియామకంపై దాసోజ్ శ్రవణ్ పిటిషన్

## తదుపరి విచారణ సెప్టెంబర్ 17కు వాయిదా

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ కోటాలో నియమితులైన ఎమ్మెల్సీ కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ.. సుప్రీం ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలలో తాజా నామినేషన్లు తమ తుది తీర్పుకి లోబడే ఉంటాయని సుప్రీంకోర్టు చెప్పుకొచ్చింది. కోదండరాం, అలీఖాన్‌లు తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియామకం అయిన విషయం తెలిసిందే. అయితే వీరి నియామకం అక్రమంగా జరిగిందని.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు గవర్నర్‌కు తెలిపారు. గవర్నర్ వీరి వాదనను తిరస్కరించడంతో.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి నియామకాలపై విచారణ జరిపి నియామకాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంను కోరారు. ఈ మేరకు బుధవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. ఆగస్టు 14, 2024 తీర్పులో మార్పులు చేస్తూ.. వారి నియామకం చెల్లదని తీర్పును వెలువరించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక గవర్నర్ కోటాలో కోదండరామ్, ఆమీర్ అలీఖాన్ నియామకమైన విషయం తెలిసిందే. ఇద్దరిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. అయితే, దీన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ అప్పటి ఎమ్మెల్సీ అభ్యర్థులు దాసోజు శ్రావణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయా పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. ఎమ్మెల్సీలుగా కోదండ రామ్, ఆలీఖాన్ ప్రమాణ స్వీకారాన్ని తప్పుపట్టింది. గతంలో ఇద్దరు ఎమ్మెల్సీల ఎన్నికపై సుప్రీంకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పని సుప్రీంకోర్టు పేర్కొంది. ఉత్తర్వులు జారీ చేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహత ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రావణ్, సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. వీరిద్దరిని అభ్యర్థిత్వాలను అప్పటి గవర్నర్ తమిళసై తిరస్కరించారు. గవర్నర్ అభ్యర్థిత్వాలను తిరస్కరించడంతో శ్రావణ్, సత్యనారాయణ ఇద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల అనంతరం 2024 జనవరి 13న ప్రొఫెసర్ కోదండ రామ్, అలీఖాన్ పేర్లను రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిపాదించింది. గవర్నర్ వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదించారు. గవర్నర్ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయించారు. కోదండ రామ్, అలీఖాన్ నియామకాలను హైకోర్టు రద్దు చేసింది. ఆ తర్వాత మరోసారి రేవంత్ సర్కారు మళ్లీ అవే పేర్లను గవర్నర్‌కు సిఫారసు చేసింది. గవర్నర్ ఆమోదంతో ఇద్దరు ఎమ్మెల్సీలుగా నియామకమయ్యారు. గవర్నర్ నిర్ణయంపై ఆగస్టు 4న దాసోజు శ్రవణ్, సత్యనారాయణ ఇద్దరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ కార్యాలయం సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం కోదండ రామ్, ఆలీఖాన్ ప్రమాణస్వీకారాన్ని తప్పుపట్టింది. అయితే ఈ విషయంపై తాజాగా ఎమ్మెల్సీ ఆమీర్ అలీఖాన్ స్పందించారు. సుప్రీం కోర్టు ఈ విధమైన తీర్పు ఇస్తుందని అనుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. కోర్టు ఆర్డర్ చదివిన తర్వాత అన్ని మాట్లాడుతానని పేర్కొన్నారు. లాయర్ కాల్ చేసి సుప్రీం కోర్టులో జరిగిన విషయాలు చెప్పారని వివరించారు. తాను మొన్నటి వరకు జర్నలిస్టును అని ఎలాంటి రాజకీయం బ్యాక్ గ్రౌండ్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో ఇంకా ప్రభుత్వ పెద్దలు మాట్లాడలేదని అలీఖాన్ స్పష్టం చేశారు.

# రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీలో రద్దీ

## మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు

## అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు

## సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి

హైదరాబాద్,

రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ బస్సులను మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకున్నారని.. ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా.. అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నాయని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ నెల 9న రాఖీ పండుగ రోజున 45.62 లక్షల మంది మహిళలు ప్రయాణించగా.. ఈ నెల 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించారని పేర్కొన్నారు. ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. గత ఏడాది రాఖీకి 2.75 కోట్ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేసిందని, ఈ ఏడాది 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించారన్నారు. గతేడాదితో పోలిస్తే 92.95 లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని.. ఈ ఏడాది 2.28 కోట్ల కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు తిరిగాయన్నారు. గత ఏడాదితో పోల్చితే 53 లక్షల కిలో మీటర్లను అదనంగా సంస్థ బస్సులను తిపిందని చెప్పుకొచ్చారు. రాఖీ పౌర్ణమికి మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుని ఉచితంగా రాకపోకలు సాగించడంపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం హర్షం వ్యక్తం చేశారు. అన్నాచెల్లెల్ల బంధం ఎంత గొప్పదో ఈ రాఖీ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. సంస్థ సామర్థ్యాన్ని అంతా ఉపయోగిం చుకుని రాఖీ పండుగకు రికార్డుస్థాయిలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పండుగను త్యాగం చేసి, భారీ వర్షాల్లోనూ నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేశారంటూ ప్రశంసించారు. రద్దీలోనూ మహాలక్ష్మి–మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని విజయవంతంగా అమలు చేశారన్నారు. ముందస్తు ప్రణాళికతో పాటు– సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం వల్లే రాఖీ పండుగకు లక్షలాది మంది ప్రయాణికులను క్షేమంగా సిబ్బంది గమ్యస్థానాలకు చేర్చారని టీ–జీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు. ఈ రాఖీ పండుగ ఆపరేషన్స్ సంస్థలో సరికొత్త రికార్డులను నమోదు చేసిందని, ఈ నెల 11న ఒక్క రోజులో అత్యధికంగా 68.45 లక్షల మంది ప్రయాణించారని చెప్పారు. ప్రజారవాణా వ్యవస్థపై ప్రజల ఆదరాభిమానాలు ఎంతలా ఉన్నాయో చెప్పేందుకు ఈ రికార్డులే నిదర్శనమని చెప్పారు. ఆర్టీసీకి సహకరిస్తూ.. ప్రజా రవాణా వ్యవస్తను ఆదరిస్తోన్న, ప్రోత్సహిస్తోన్న ప్రయాణికులందరికీ సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు.



# బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై విచారణ

## ఎక్కువ ధృవీకరణ పత్రాలకు అనుమతి మంచిదే

## విచారణ సందర్భంగా సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ,

బీహార్‌లో ఓటర్ల జాబితాను సవరించాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఏడు ధ్రువీకరణ పత్రాలకంటే.. ప్రస్తుతం 11 పత్రాలను అనుమతించడం ఓటర్లకు ప్రయోజనకరంగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆధార్ మినహా అనేక ఇతర డాక్యుమెంట్లను పరిగణలోకి తీసుకోవడాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. గతంలో బిహార్‌లో నిర్వహించిన రివిజన్‌లో ఏడు ధ్రువీకరపత్రాలను అనుమతించారని.. ప్రత్యేక సవరణలో 11 డాక్యుమెంట్లను ఈసీ అనుమతి ఇస్తుందని.. దీన్ని పరిశీలిస్తే ఓటర్లకు అనుకూలంగానే కనిపిస్తుందని ధర్మాసనం తెలిపింది. ఆధార్ అనుమతించడం లేదనే పిటిషనర్ల వాదనను అర్థం చేసుకున్న ప్పటికీ అనేక పత్రాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లుగా ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, ఈ వాదనలతో పిటిషనర్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విభేదించారు. ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నా.. అందరికీ అందుబాటులో లేవని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాస్‌పోర్టులను ఉదహరించారు. బిహార్‌లో కేవలం ఒకటి నుంచి రెండుశాతం మంది వద్దే పాస్ పోస్టులు ఉన్నాయన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం 36లక్షల మందికి పాస్‌పోర్టులు ఉన్నాయని.. ఇది మంచి సంఖ్యగానే కనిపిస్తోందని చెప్పింది. ఆయా ప్రభుత్వ విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ధ్రువపత్రాల జాబితా రూపొందిస్తారని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ అంశంపై మంగళవారం సైతం సుప్రీంకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. పౌరులను చేర్చడం, కానివారిని ఓటరు జాబితా నుంచి మినహాయించడం ఎన్నికల కమిషన్ అధికార పరిధిలోనిదని ధర్మాసనం పేర్కొంది. సర్‌లో ఆధార్, ఓటర్ కార్డును పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమన్న ఈసీ వాదనలను సమర్థించింది. పార్లమెంట్ లోపల, వెలుపల 'సర్' అంశంపై వివాదం పెరుగుతున్న నేపథ్యంలో.. ఈసీ చేపట్టిన ఈ కార్యక్రమంపై విశ్వాసం కోల్పోవడమే సమస్య అని.. అంతకు మించి ఏమీ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.



# అరచాకం నుంచి బయటపడుతున్న పులివెందుల

### ప్రజలు ఇప్పుడిప్పుడే స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితి

### మీడియా చిట్‌చాట్‌లో సీఎం చంద్రబాబు

**అమరావతి,**

పులివెందుల ప్రజలు ఇప్పుడిప్పుడే అరాచకం నుంచి బయట పడుతున్నారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటేసే స్థితి వచ్చిందన్నారు. 11 మంది పోటీ చేయడం, రెండు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్జరగడం ఇందుకు నిదర్శనమని అన్నారు. పార్టీ కేంద్ర పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం సీఎం చంద్రబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా పలువురికి ఆర్థిక సాయం చేశారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలపై అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు సమాధానమిచ్చారు. వైయస్ హయాం నుంచి పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరగలేదు. ఈసారి అరాచకాలు జరగలేదనే అసహనంతో జగన్ ఉన్నారు. ఆయన వైఖరి ఏలాంటిదో ప్రజలకు తెలిసిందే. నామినేషన్ వేసేందుకే భయపడే పరిస్థితి నుంచి 11 మంది పోటీ- చేశారు. రెండు పోలింగ్ బూత్‌ల్లో ఎప్పుడైనా రీపోలింగ్ జరిగిందా? శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉన్నాయి కనుకే ప్రజలు ధైర్యంగా ఓటేశారని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలపై అప్రమత్తంగా ఉన్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. భారీ వర్షాల కారణంగా పలువురు మరణించడం బాధాకరమన్నారు. నష్ట నివారణకు ఎక్కడికక్కడ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు సమన్వయం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

# రెండేళ్లయినా ఆరు గ్యారెంటీలేవీ

### ఎక్కడికైనా వెళ్లి ప్రజలను అడుగుదామా

### డిప్యూటి సిఎం భట్టికి కెటిఆర్ సవాల్

**హైదరాబాద్,**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం తన ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు గుప్పించారు. అందులోభాగంగా డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కకు ఆరుగ గ్యారెంటీల వాగ్దానం గుర్తుందా ? అని ప్రశ్నించారు. 100 రోజులు కాదు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 2 సంవత్సరాలు అయినా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదంటూ మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేశామని తెలంగాణలోని ఏ గ్రామానికైనా వెళ్లి చెప్పగలరా? అంటూ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కను కేటిఆర్ తన ఎక్స్ ఖాతా వేదికగా సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికే అబద్దాలు చెప్పిన మీ నాయకులను ప్రజలు వెంబడిస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు- క్యాబినెట్ మంత్రులంతా తెలంగాణలో ఎక్కడికైనా వెళ్లి.. తమ ప్రభుత్వం ఆరు హామీలు నెరవేర్చామని చెప్పాలని ఆయన సూచించారు. మీ అబద్ధాలు, తప్పుడు ప్రచారాలపై ప్రజలు మిమ్మల్ని తరిమికొట్టక పోతే.. నేను రాజకీయాలను విడిచి పెడతానంటూ డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ-ఆర్ సవాల్ విసిరారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

### కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ పాత పద్దతి అమలు

### యూరియాను బీహార్‌కు తరలిస్తున్నారు

### ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా యూరియా రాదు

### యూరియా కోసం క్యూలో ఉన్న రైతులతో హరీష్ రావు

**సిద్దిపేట,**

యూరియా కోసం అన్నదాతలు నడిరోడ్డెక్కి ధర్నాలు చేసే దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతులకు యూరియా ఇవ్వలేని చేతగాని, దద్దమ్మ ప్రభుత్వాలు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలను అరిగోస పెడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు రైతుల ఉసురు తగులుతుందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామం వద్ద ఎరువుల కోసం క్యూలో బారులు తిరిన రైతులను చూసి మాజీ మంత్రి హరీష్ రావు ఆగారు. ఈ సందర్భంగా వారిని పలుకరించగా.. ఉదయం 5 గంటల నుండి ఇక్కడే ఉంటున్నాం.. ఒక ఆధార్ కార్డుకి ఒకటే బస్తా ఇస్తామంటున్నారు. ఆధార్ కార్డు, ఓటీపీ అంటూ కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని హరీశ్‌రావుతో రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఈ గోస లేదని.. కాంగ్రెస్ వచ్చాక నీళ్ళు లేవు, యూరియా లేదు అంటూ రైతులు ఆవేదన వెలిబుచ్చారు. యూరియా ఎప్పుడు వేసుకోవాలి.. ఎప్పుడు పంట పండాలి అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.కేసీఆర్ హయంలో హమాలీ ఖర్చులు ఇచ్చి ఇంటికి యూరియా పంపించామని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉదయం నుండి రైతులు వచ్చి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే అధికారి లేదు అని అగ్రికల్చర్ అధికారులపై హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచి రాష్ట్రానికి ఎరువుల కొరత తీర్చడంలో విఫలం అయ్యారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఎరువుల కొరతపై నోరు మెదపడం లేదు.. రైతుల ఉసరు ఉట్టిగా పోదు.. 4 రోజుల నుండి వ్యసాయ పనులు వృధా చేసుకొని యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బిజేపీలకు తగిన గుణపాఠం చెపుతారని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 51 సార్లు ఢిల్లీకి పోయాడు.. కానీ ఎరువుల కొరత తీర్చలేదు. మీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నాడు. రేవంత్ రెడ్డి తిట్లు- ఎక్కువ పని తక్కువ అని. ప్రజలకు కావాల్సింది తిట్లు కాదు, పని కావాలి. రేవంత్ రెడ్డికి తిట్ల మీద ఉన్న ధ్యాస.. పని మీద లేదు. రైతులు సూటిగా అడుగుతున్నారు కేసీఆర్ ఉన్నపుడు ఎరువులు ఎట్లా వచ్చాయి.. ఇప్పుడు ఎట్లా రావు అని. వెంటనే ఓటీ-పీ, ఒక్క బస్తా విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నట్లు- హరీశ్‌రావు పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎరువుల ఇబ్బంది లేదు. ప్రతి మండలానికి గోదాంలు ఏర్పాటు- చేసుకొని, వేసవి కాలంలోనే ఎరువులు స్టాక్ పెట్టినం. గ్రామం నుండి రైతు కాలు బయట పెట్టకుండా.. హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు లేకుండా రైతు సమయం వృధా కాకుండ గ్రామంలోనే ఎరువులు అందిచాం. నాలుగు రోజుల నుండి ఇక్కడికి వచ్చి ఉంటే ఒక్క బస్తా ఇస్తామని చెప్పడం బాధాకరం. దేవుడు దర్శనం దొరుకుతుంది కానీ ఎరువుల బస్తా దొరకడం లేదని మహిళా రైతు భాగ్యమ్మ చెప్పడం ఈ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపునకు నిదర్శనం. వెంటనే ఓటీ-పీ విధానం, ఒక బస్తా విధానంను తీసేయాలని డిమాండ్ చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల బస్తాలు ఇవ్వాలని డిమాండ్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మళ్ళీ పాత రోజులు వచ్చాయి.. ఇదేనా కాంగ్రెస్ మార్పు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రైతు వ్యతిరేక ప్రభుత్వం, నానో యూరియా వాడాలని చెప్పడం రైతులపై 500 రూ. అదనపు భారం వేయడమే. నానో యూరియ తో రైతులకు ఎకరానికి రూ. 500లు భారం పడుతుంది. ప్రభుత్వం సబ్సిడీ నుండి తప్పించుకోడానికి కృత్రిమ ఎరువులను సృష్టిస్తుంది. ఎన్నికలు ఉన్నాయని బీహార్‌కు ఎరువులను తరలిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకునేందుకు కృత్రిమ కొరతను సృష్టిస్తోందని విమర్శించారు. ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువులు తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాకు గుణపాఠం చెప్పాలన్నారు.

# అత్యవసర సేవలకు సిద్దంగా ఉండాలి

### భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి దామోదర ఆదేశం

**హైదరాబాద్,**

రాష్ట్రానికి 3 రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నందున ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరన్స్ నిర్వహించారు. హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, ఆర్ఎంవోలు, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది ఈ మూడు రోజులు కచ్చితంగా హాస్పిటల్స్‌లోనే ఉండాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు- చేసుకోవాలన్నారు. అందరి సెలవులు రద్దు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టిమే-టె-డ్ డెలివరీ డేట్ దగ్గరగా ఉన్న గర్భిణులను హాస్పిటల్స్‌లోని బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించి సేవలందించాలన్నారు. అంబులెన్స్‌లు, 102 వాహనాలు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా తక్షణమే వెళ్లి పేషెంట్‌ను తరలించేలా డ్రైవర్లు, ఈఎంటీ-లను 24 గంటలు అందుబాటు-లో ఉంచుకోవాలన్నారు. హాస్పిటళ్లలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పవర్ కట్ అయిన మరుక్షణమే జనరేటర్స్ ప్రారంభించి రోగులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎలక్ట్రీషియన్లను 24 గంటలు హాస్పిటల్‌లో అందుబాటులో ఉంచుకోవా లన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో హాస్పిటల్స్ లోపలికి నీరు చేరకుండా, నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులంతా ఈ మూడు రోజులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# కాళేశ్వరం జలాశయాలు నింపండి

### వెంటనే మోటర్లు ఆన్ చేసి పంపింగ్ చేయాలి

### మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ

**సిద్దిపేట,**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న జలాశయాలు నింపాలని అందులో విజ్ఞప్తి చేశారు. మధ్య మానేరు, అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాలను నింపాలని కోరారు. రైతుల కోసం ఆరో ప్యాకేజీ వద్ద ఉన్న మోటార్లు ఆన్ చేయాలన్నారు. జలాశయాల్లో నీరు నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలని లేఖలో పేర్కొన్నారు. రిజర్వాయర్‌లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను వెంటనే నింపాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజ్-6 వద్ద మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని కోరారు. కేసీఆర్ హయాంలో హమాలీ ఖర్చులు ఇచ్చి ఇంటికి యూరియా పంపించామని గుర్తు చేశారు. ఉదయం నుంచి రైతులు వచ్చి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే అధికారి లేరని అగ్రికల్చర్ అధికారులపై సీరియస్ అయ్యారు. పదేళ్లలో లేని కొరత.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎరువుల కొరత మూమ్మాటికీ ఈ బీజేపీ , కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యమేనని విమర్శించారు. పదేళ్లలో కేసీఆర్ హయాంలో ఎరువుల ఇబ్బంది లేదని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపునకు నిదర్శనమని ఆక్షేపించారు హరీష్‌రావు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# తెలంగాణ అంతటా రెండ్రోజుల పాటు రెడ్ అలర్ట్

### రాష్ట్రంలో ఐదు రోజుల పాటు ఈదురు గాలులు

### వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న

**హైదరాబాద్,**

తెలంగాణ అంతటికీ రెండ్రోజుల పాటు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు- వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. రాష్ట్రంలో ఐదు రోజుల పాటు- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ఉత్తర తెలంగాణలో 17న వర్ష తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు- భారీ వర్షాలు కురుస్తాయని నాగరత్న తెలిపారు. సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు- తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురం భీం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు- చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా రేపు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని నాగరత్న వివరించారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశాం. రేపు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇవాళ జీహెచ్ఎంసీ పరిధిలో రెడ్ అలర్ట్.. రేపు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని అన్నారు.

# భారీ వర్షాలతో నిండుకుండలా సాగర్

26గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు

**నాగార్జునసాగర్,**

నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టులో 26 గేట్లు- ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. జలాశయం వద్ద ఇన్‌ఫ్లో 2,28,601 క్యూసెక్కులు, ఔట్‌ఎ÷-లో 2,47,986 క్యూసెక్కులుగా ఉంది. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు.. కాగా ప్రస్తుత నీటిమట్టం 589.20 అడుగులుగా నమోదైంది. పూర్తి నీటినిల్వ సామర్థం 312.04 టీ-ఎంసీలు.. కాగా ప్రస్తుతం 309.65 టీఎంసీలకు చేరింది. తెలంగాణ వ్యాప్తంగా గత వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు జిల్లాల్లో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు చెరువులు, కుంటలు వరదలతో నిండిపోయాయి. దీంతో దుగువ ప్రాంతాలకు వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. ఇక, భారీ వర్షాలతో నాగార్జునసాగర్ జలాశయంలోకి పెద్ద ఎత్తు వరద నీరు వచ్చే చేరుతుంది. దీంతో సాగార్ డ్యామ్ నిండుకుండలా మారింది. ఈక్రమంలో అధికారులు జలాశయం 26 గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం వద్ద జలకళ సంతరించుకోవడంతో అధిక సంఖ్యలో జనాలు వస్తున్నారు. సాగర్ అందాలను చూసేందుకు వచ్చే సందర్శకులతో డ్యామ్ వద్ద సందడి వాతావరణం నెలకొంది.

# ఖమ్మం జిల్లాలో జోరు వర్షాలు

### ఆకేరు వాగులోని చెక్‌డ్యాం మీదుగా వరద నీరు

### గతేడాది వరదలు తలచుకుని ముందస్తు చర్యలు

**ఖమ్మం,**

జిల్లాలో రెండు రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. భారీగా వరద రావటంతో పాలేరు జలాశయం మత్తడి దుంకి ప్రవహించింది. సాయంత్రం 18,500 క్యూసెక్కులకు వరద ఉద్ధృతి పెరగటంతో అలుగు ఉప్పొంగుతోంది. ఆ స్థాయి వర్షాలు మున్నేరు ఎగువన కురిసి ఉంటే ఇప్పటికే వాగు ఉగ్రరూపం దాల్చేదే. ఆకేరు వాగులోని చెక్‌డ్యాం మీదుగా వరద నీరు పారుతోంది. పరిసరాల్లోని చెరువులు నిండటానికి సిద్ధంగా ఉన్నాయి. ఎగువ నుంచి వరద వస్తుండటంతో మున్నేరులో ప్రస్తుతం పది అడుగుల వద్ద నీరుంది. ఆకేరు పరిసరాల్లో వర్షం కురిస్తే రాత్రి వరకు 14అడుగులకు చేరుకుంటుందని నీటిపారుదలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మున్నేరు వరద విలయంతో గతేడాది సెప్టెంబరు 1న ఖమ్మం జిల్లాకేంద్రం అతలాకుతలమైంది. పరీవాహక కాలనీల్లోని ఇళ్లు నీట మునగటంతో జరిగిన నష్టం నుంచి పేదలు ఇంకా కోలుకోలేదు. నాటి విషాద దృశ్యాలను తలచుకుంటే ఒళ్లు జలదరిస్తుందని, భారీ వర్షాలు కురవనున్నాయని తెలిస్తే వణుకు పుడుతోందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ హెచ్చరించటంతో అప్రమత్తమయ్యారు. గతంలో మున్నేరుకు వచ్చే వరదను అంచనా వేయకపోవటంతోనే రాత్రికిరాత్రే ఉపద్రవం ఎదురైంది. ఈసారైనా అధికారులు అప్రమత్తంగా ఉంటూ.. ఆకేరు వాగు, ఎగువనున్న చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించి వరద రాకను పసిగట్టి ప్రజలకు సూచనలిస్తేనే ముప్పు తప్పుతుంది. ఈనెల 14నుంచి 17వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. అధికారులకు సెలవులు రద్దు చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్‌ప్రకటించారు. యంత్రాంగం కార్యస్థానంలో ఉండాలన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో బయటకు రావద్దు

### నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక

**హైదరాబాద్,**

భారీ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అవసరమైతే తప్ప.. బయటకు రావద్దని హైదరాబాద్ నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురవనున్నాయంటూ వాతావరణ శాఖ తెలిపిందని.. దీంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు. బుధవారం హైదరాబాద్‌లో రంగనాథ్ మాట్లాడుతూ.. ఎంతటి విపత్తు ఎదురైనా.. వాటిని ఎదుర్కొనేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, జలమండలి, విద్యుత్ అధికారుల సమన్వయం తో పని చేస్తున్నామని ఆయన వివరించారు. అలాగే లోతట్టు- ప్రాంతాల్లో భారీగా వరద నీరు వస్తే.. ప్రజలను రక్షించేందుకు బోట్స్‌తో సహా అన్నింటిని సిద్ధం చేశామని చెప్పారు. అయితే రాత్రి సమయంలో వర్షపాతం అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉండడంతో.. రాత్రి నుంచి హైడ్రా బృందాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. నాలాల కబ్జాల కారణంగానే రహదారులపైకి భారీగా వరద నీరు వస్తుందని ఆయన తెలిపారు. ఇక ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో దాదాపు 400కి పైగా వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉన్నాయన్నారు. అలాగే మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద ఇప్పటికే సిబ్బంది ఉన్నారన్నారు. ఒక వేళ భారీ వర్షాలు కురిస్తే.. సహాయక చర్యల్లో పాల్గొనాలని యువతకి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.

# మేకకు ఆకుల కోసం వెళ్ల నాలాలో పడ్డ వ్యక్తి

### నిచ్చెన వేసి కాపాడిన స్థానికులు

**హైదరాబాద్,**

:మేకకు ఆహారం కోసం ఆకులు కోయడానికి వెళ్లిన ఓ వ్యక్తి.. పట్టుతప్పి నాలాలో పడిపోయాడు. హైదరాబాద్‌లోని పాతబస్తీ పరిధి యాకుత్‌పురాలో ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. గౌస్ అనే వ్యక్తి తన మేక కోసం ఆకులు కోస్తూ.. ఉధృతంగా ప్రవహిస్తున్న నాలాలో ప్రమాదవశాత్తూ పడిపోయాడు. స్థానిక ఎంఐఎం కార్పొరేటర్ మహమ్మద్ వాసే.. స్థానికుల సాయంతో అతడిని కాపాడారు. నిచ్చెన వేసి తాడు సాయంతో బయటకు లాగారు. అతడు క్షేమంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. హైదరాబాద్ పరిధిలో భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే.

# తాళ్ల సాయంతో గర్భిణిని వాగు దాటించిన పోలీసులు

**మంచిర్యాల,**

జిల్లాలో భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. తాండూరు మండలంలోని నర్సాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మారుమూల గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దొడ్డిగూడెంలో తొమ్మిది నెలల గర్భిణి యమునకు పురిటి నొప్పులు వచ్చాయి. ఆమెను వాగు దాటించేందుకు కుటుంబసభ్యులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై కిరణ్ కుమార్.. పోలీసు సిబ్బంది, ఈతగాళ్లను ఘటనాస్థలికి పంపారు. వారు తాళ్ల సాయంతో గర్భిణిని వాగు దాటించి అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె మగబిడ్డకు జన్మనిచ్చినట్టు- వైద్యులు తెలిపారు.

---------------

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# దొడ్డిదారిన ఎన్ఆర్సీ

బీహార్ ఓటర్ల జాబితాను సవరించడానికి ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కసరత్తుపై రాజకీయ దుమారం చెలరేగిన విషయం విదితమే. నేషనల్ రిజిష్టర్ ఆఫ్ సిటిజెన్‌ను (ఎన్ఆర్సీ) ఎన్నికల సంఘం దొడ్డిదారిన అమలు చేస్తున్నదని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ది ఫెడరల్' ఎడిటర్ ఇన్ చీఫ్ ఎస్.శ్రీనివాసన్ 'టాకింగ్ సెన్స్ విత్ శ్రీని' పేరిట ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఎస్ఐఆర్ పేరిట ఓట్ల తొలగింపు, సమాఖ్యవాదం, పారదర్శకత, పౌరసత్వం పట్ల ఈ కసరత్తు లేవనెత్తుతున్న ఆందోళనలపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. మరణించిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు తరలిపోయినవారు, నకిలీ ఓట్లను తొలగించడానికి సాధారణంగా ఎలక్షన్ కమిషన్ ఓటర్ల జాబితాలో సవరణలు చేస్తుంటుంది. ఇది నిరంతరంగా లేదా ఎన్నికల సమయంలో జరిగే సర్వసాధారణ



ప్రక్రియ. అయితే బీహార్‌లో జరుగుతున్నది ఇందుకు భిన్నంగా ఉన్నది. ఇది ఓటర్ల జాబితాను సవరించే సాధారణ ప్రక్రియ కాదు, ఎస్ఐఆర్ పేరిట జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన. ఇది కొత్త ప్రక్రియ, ఆందోళనకరమైనది కూడా. చివరిసారిగా 2023లో ఓటర్ల జాబితాలో సవరణలు జరిగాయి. ఇప్పుడు మళ్లీ ఒక సంవత్సరం తర్వాత, అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా ప్రత్యేక కసరత్తును ఈసీ ప్రారంభించింది. అంతేకాదు, ఒక్క నెలలోనే పూర్తి చేస్తామంటున్నది. అంటే దాదాపు ఎనిమిది కోట్ల మంది ఓటర్లు అతి తక్కువ సమయంలో తమను తాము ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. అందువల్లే ఈ ప్రక్రియపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇది కేవలం ఓటర్ల జాబితా సవరణ కాదని, ఓటర్ల జాబితా పునర్నిర్మాణమని అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈసీ ఇచ్చిన సమయం విడ్డూరంగా ఉన్నది. సీమాంచల్ ప్రాంతంలోని అనేక జిల్లాలు వరదలో మునిగిపోయాయి. చాలామంది నిరాశ్రయులయ్యారు. అక్కడ ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అందుబాటులో ఉంటారని, సహకరిస్తారని బీహార్‌కు చెందిన సుమారు రెండు కోట్ల మంది ప్రజలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో వలస కూలీలుగా పని చేస్తున్నారు. అలాంటివారు ఎక్కడికక్కడ తమ వివరాలను సమర్పించాలని ఈసీ ప్రకటించింది. అయితే ఆ ప్రకటనలను వలస కార్మికులు చూశారా, లేదా? ఒకవేళ చూసినా అర్థం చేసుకున్నారా? ఎలాంటి పత్రాలు కావాలో వారికి తెలుసా? అనేది సందేహమే. 2003 తర్వాత ఓటరుగా నమోదు చేసుకున్నవారు తమ జనన, తల్లిదండ్రుల పౌరసత్వ రుజువును కూడా సమర్పించాలనడం అతిపెద్ద సమస్య. ఇది సాధారణ ఓటరు జాబితా సవరణను పౌరసత్వ ధ్రువీకరణ ప్రక్రియగా మారుస్తున్నది. ఈ కసరత్తు ఓటర్లను చేర్చడానికా, లేదా మినహాయించడానికా అన్నది అసలు ప్రశ్న. ఒకసారి భారత ఎన్నికల ప్రాథమిక సూత్రాన్ని చూద్దాం. భారతదేశంలో జన్మించి, 21 ఏండ్లు పైబడిన (ఇప్పుడు 18 ఏండ్లు) ఎవరైనా ఓటు వేసే అవకాశం 1950లలో ఉండేది. 1987లో అప్పటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1987 జూలై 1 తర్వాత జన్మించినవారు ఓటరుగా అర్హత సాధించాలంటే, తమ తల్లిదండ్రుల్లో ఒకరైనా భారతీయులై ఉండాలని చట్టాన్ని సవరించింది. తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై, మరొకరు అక్రమ వలసదారులు కాకూడదని వాజపేయి ప్రభుత్వం మరో సవరణ చేసింది. దానివల్ల 2003లో ఖరారు చేసిన జాబితా ఇప్పుడు బెంచ్‌మార్క్‌గా మారింది. అందువల్ల 2003కి ముందు ఓటరుగా నమోదు చేసుకున్నవారు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. కానీ, ఆ తర్వాత నమోదు చేసుకున్నవారు 11 పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అలాంటి ఓటర్లు బీహార్‌లో సుమారు 3.8 కోట్ల మంది ఉండొచ్చని అంచనా. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను గుర్తింపు పత్రాల జాబితా నుంచి మొదట మినహాయించడం చర్చనీయాంశం. పేదలు, శ్రామికులు, వలస కార్మికుల వద్ద ఉండే గుర్తింపు పత్రాలు ఇవే. బీహార్‌లో చాలా తక్కువ మంది వద్ద జనన ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్‌లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీహార్‌లోని కొన్ని రాజకీయ పార్టీలు, కొందరు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, పైన పేర్కొన్న పత్రాలను ఈసీ పరిగణించాలని న్యాయస్థానం సూచించిందే తప్ప, ఆదేశించకపోవడం గమనార్హం. ఈ కసరత్తును అత్యంత వేగంగా చేయడంపై కూడా అనేక సందేహాలున్నాయి. జర్నలిస్టు అజిత్ అంజుమ్‌కు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. అందులో బూత్ స్థాయి అధికారులు ప్రభుత్వ కార్యాలయంలో కూర్చొని ఓటర్ల తరఫున ఫామ్స్ నింపుతున్నట్టు కనిపించింది. వారు ఇంటింటికి వెళ్లి ధ్రువీకరించడం లేదు. వారి వద్ద ఉన్న పాత జాబితాలోని వివరాలను ఫామ్స్‌లో నింపుతున్నారు. బీఎల్‌వోలకు అసాధ్యమైన పనిని అప్పగించారు. ఒక్క నెలలోనే దాదాపు 8 కోట్ల మంది ఓటర్లను ధ్రువీకరించడం చాలా కష్టం. గ్రామీణ ప్రాంతాల్లో చాలామందికి ఈ ఫామ్స్ వేటికి సంబంధించినవో కూడా తెలియదు. ఇప్పటికే 30 లక్షల మంది పేర్లను తొలగించినట్టు ఈసీ చెప్తున్నది. ఫామ్స్ ముద్రణ, పంపిణీ, మళ్లీ సేకరణ, వివరాల అప్‌లోడ్.. ఇదంతా చేయడానికి చాలా సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రక్రియ లోపభూయిష్ఠంగా, మోసపూరితంగా జరిగి ఉండవచ్చని ఎస్ఐఆర్ వేగం మనకు సూచిస్తున్నది. భారతదేశంలో ఆధార్‌ను గుర్తింపు పొందిన ధ్రువపత్రంగా ప్రభుత్వం మొదటినుంచీ చెప్తూ వస్తున్నది. పాన్‌కార్డులు, బ్యాంక్ అకౌంట్లు, ఫోన్ నెంబర్లు, ఓటర్ల జాబితాతో కూడా దీన్ని లింకు చేశారు. ఓటర్ ఐడీకి ఆధార్‌ను లింకు చేయాలని గతంలో ఈసీ పట్టుబట్టింది కూడా. అయినప్పటికీ ఈ కసరత్తులో ఆధార్‌ను మినహాయించారు. ఆధార్‌ను ఇప్పుడు నమ్మదగనిదిగా భావిస్తే.. మన దైనందిన జీవితంలోని అనేక అంశాల్లో దాన్ని ఎందుకు తప్పనిసరి చేశారు? వలసదారులను గుర్తించడం ఎన్ఆర్సీ ఉద్దేశం. ప్రస్తుతం అది అసోంలో మాత్రమే వర్తిస్తుంది. దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీ అమలుకు సంబంధించిన బిల్లును పార్లమెంట్ ఆమోదించినప్పటికీ, తీవ్ర వ్యతిరేకత కారణంగా దాన్ని ఇంకా నోటిఫై చేయలేదు. వాస్తవానికి ఈసీకి పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారం లేదు. ఓటర్లను నమోదు చేయడమే దాని పని. జనన ధ్రువీకరణ, తల్లిదండ్రుల పౌరసత్వాన్ని నిరూపించే పత్రాలను అడగడం ద్వారా తనకు సంబంధం లేని అంశంలో ఈసీ వేలు పెడుతున్నది. అందుకే, మరొక పేరుతో ఈసీ పరోక్షంగా ఎన్ఆర్సీని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నదనే భయాందోళనలు కలుగుతున్నాయి. బీహార్‌లో జరుగుతున్నది ఎస్ఐఆర్ పైలట్ ప్రాజెక్టు అని ఈసీ ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో త్వరలో ఎన్నికలు జరుగనున్న తమిళనాడు వంటి రాష్ట్రాలు తర్వాతి స్థానంలో ఉండొచ్చు. ఇది 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'కు నాంది కావచ్చనే చర్చ కూడా జరుగుతున్నది. వాస్తవానికి ఓటర్ల జాబితాలను సాధారణంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్లు రూపొందిస్తాయి. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో సమాఖ్యవాదం పట్ల కూడా ఆందోళనలు రేకెత్తుతున్నాయి. ఈ ప్రక్రియపై తమ అభిప్రాయాలను చెప్పడానికి రాష్ట్రాలకు అవకాశం ఉంటుందా? రాష్ట్రాల అభ్యంతరాలను వింటారా? అన్నది ప్రశ్నార్థకమే. ఓటర్ల జాబితా నుంచి ఎవరూ మినహాయించకుండా చూసుకోవడం ఈసీ విధి. మన దేశంలో ఒక వ్యక్తి ఓటరుగా అర్హుడా, కాదా? అన్నది రుజువు చేసుకోవాల్సిన బాధ్యత మొదటినుంచీ పౌరులది కాదు.

# బీహార్ ఓటర్ల జాబితా సవరణ

## విచారణచేపట్టిన సుప్రీంకోర్టు

## వివరాలతో సిద్ధంగా ఉండాలని ఆదేశం

## ఆధార్‌ను పౌరసత్వంగా గుర్తించలేమన్న ధర్మాసనం



న్యూఢిల్లీ,

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే సరైన వివరాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం సూచించింది. విచారణ క్రమంలో ఆర్జేడీ నేత మనోజ్ ఝా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఓ నియోజకవర్గంలో 12 మంది చనిపోయారని ఈసీ పేర్కొందని, కానీ వారు సజీవంగా ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మరో సందర్భంలో.. బతికే ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు ప్రకటించారని ఆరోపించారు. అయితే.. ఇటువంటి ప్రక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్లు, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్లు- ప్రకటించడం వంటి తప్పిదాలను సరిదిద్దవచ్చని.. ఇది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే.. వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి 'సుప్రీం' ధర్మాసనం సూచించింది. ఎస్ఐఆర్ పక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు; గతంలో నమోదైన మరణాల సంఖ్య; ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. బిహార్ ఎస్ఐఆర్‌లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటామని జులై 29న సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న విషయం తెలిసిందే. అంతకుముందు జులై 10న చేపట్టిన విచారణ సందర్భంగా.. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది. అదేవిధంగా ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఓటర్ ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఆధార్ సేవలను కీలకమైన గుర్తింపు డాక్యుమెంట్‌గానే పరిగణనలోకి తీసుకుంటున్నామని, భారతదేశ పౌరసత్వానికి అది కచ్చితమైన రుజువు కాదని, సరైన వెరిఫికేషన్ తప్పనిసరని ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న వైఖరిని సుప్రీంకోర్టు సమర్థించింది. బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణ కు ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఆధార్‌ను కంక్లూజివ్ ప్రూఫ్‌గా ఆమోదించలేమని ఎన్నికల కమిషన్ చెప్పడం సరైనదేనని జస్టిస్ సూర్య కాంత్ అన్నారు. ఓటర్ వెరిఫికేషన్ పక్రియను చేపట్టే అధికారం ఈసీఐకి ఉందా అనే ప్రాథమిక అంశాన్ని నిర్ణయించాల్సి ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. అలాంటి అధికారం లేనట్టయితే ఈ అంశం ఇక్కడితో ముగుస్తుందని, ఆ అధికారం ఈసీఐకి ఉన్నట్లయితే ఓటర్ వెరిఫికేషన్ పక్రియపై ఎలాంటి అభ్యంతరాలు ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది కపిల్ సిబాల్ తన వాదన వినిపిస్తూ, 1950 తర్వాత పుట్టిన ప్రతివ్యక్తి భారతదేశ పౌరుడేనని, అయితే ప్రస్తుతం జరుగుతున్న ఎక్సర్‌సైజ్‌లో విధానపరమైన తీవ్ర తప్పిదాలున్నాయని అన్నారు. ఉదాహరణగా ఒక చిన్న అసెంబ్లీ నియోజకవర్గంలో నివసిస్తున్న 12 మందిని చనిపోయినట్టు- పేర్కొన్నారని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించ లేదని అన్నారు. పోల్ ప్యానల్ సరైన విధానాన్ని అనుసరించకపోవడం వల్ల పెద్ద సంఖ్యలో ఓటర్ల తొలగింపు జరిగిందని, ముఖ్యంగా అవసరమైన దరఖాస్తులు సమర్పించలేక పోయిన వారిపై ఈ ప్రభావం ఉంటుందని అన్నారు. 2003 ఓటర్ల జాబితాలో పేరున్న వారిని కూడా కొత్తగా ఫామ్‌లు సమర్పించమనడం, అలా చేయని పక్షంలో రెసిడెన్స్‌లో ఎలాంటి మార్పు లేనప్పటికీ వారిని తొలగించడం జరుగుతుందన్నారు. ఈసీఐ ప్రకటించిన గణాంకాల ప్రకారం 7.24 కోట్ల మంది అవసరమైన ఫామ్స్ దాఖలు చేశారని, అయినా 65 లక్షల మంది ఓటర్ల పేర్లు సరైన వెరిఫికేషన్ లేకుండా తొలగించారని అన్నారు. పేర్ల తొలగింపును బలపరచే ఎలాంటి సర్వే నిర్వహించ లేదని అఫిడవిట్‌లో ఎన్నికల కమిషన్ అంగీకరించిందని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇటువంటి పక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్టు-, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్టు- ప్రకటించడం వంటి తప్పుదాలని సరిదిద్ద వచ్చున్నారు. ఇది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని కోర్టుకు విన్నవించారు. ఈ క్రమంలోనే వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. ఇదిలా ఉండగా.. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ ఇప్పటికే పూర్తయ్యింది. ఈ నెల 1న ముసాయిదా జాబితాను ప్రచురించారు. ఎస్ఐఆర్ పక్రియ చేపట్టక ముందు రాష్ట్రంలో మొత్తం నమోదిత ఓటర్ల సంఖ్య 7.9 కోట్లుగా ఉండగా, ముసాయిదాలో అది 7.24 కోట్లకు తగ్గింది. సెప్టెంబర్ 30న తుది జాబితాను ప్రకటించనున్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

# తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

## ఉరుములు,మెరుపుల తో వానలు పడతాయ్

## ప్రజలు అసవరమైతే తప్ప బయటకు రావద్దు

## ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్న వాతావరణ శాఖ

## భారీగా నీటి చేరికతో సాగర్ 16 క్రస్ట్ గేట్లుఎత్తి నీటి విడుదల

## నీట మునిగిన వరంగల్ జంటనగరాలు

## మత్తడి పోస్తున్న పలు గ్రామాల చెరువులు

## పొంగి ప్రవహిస్తున్న ఆకేరు వాగు

హైదరాబాద్,

తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్, అరెంజ్ అలర్టులు జారీ చేసింది. అయితే మరోసారి వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఈ మేరకు ప్రజలందరూ.. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే ఛాన్స్ ఉందని ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని పేర్కొంది. వర్షం పడే సమయంలో చెట్ల కింద కూడా ఉండకూడదని హెచ్చరిస్తుంది. ప్రయాణాలు మానుకోవాలని, లేని పక్షంలో వాయిదా వేసుకోవాలని తెలుపుతుంది. భారీ వర్షాల కారణంగా రోడ్లు, బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్లు జలమయం అవుతున్నాయి. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తూ.. చర్యలు చేపడుతుంది. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ.. అధికారులను ప్రజలతో సమన్వయం అయ్యేలా.. చూస్తుంది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. జిల్లా ప్రజలు వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని తెలుపుతున్నారు. పొలాల దగ్గరకు వెళ్లాల్సిన రైతుల కూడా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజల దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు- చేసినట్లు- తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్ 7981975495 కు ఫోన్ చేయాలని అధికారులు వెల్లడించారు. ఇకపోతే ఎగువన కురుస్తున్న వర్షాలతో నాగార్జున సాగర్ జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో అధికారులు 16 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టుకు 1,77,173 క్యూసెక్కుల వరద వస్తోంది. స్పిల్‌వే ద్వారా 1,28,768 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రస్తుత నీటి మట్టం 589 అడుగులుగా ఉంది. ఇకపోతే వరంగల్, హనుమకొండ, కాజీపేటలో భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో హనుమకొండ బస్టాండ్, చౌరస్తా, ఇతర లోతట్టు- ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. రహదారులు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై భారీగా నీరు నిలవడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వర్ధన్నపేటలోని ఆకేరువాగు పొంగిపొర్లుతోంది. సంగెం మండలం ఎల్గూరురంగంపేట పెద్దచెరువు, పర్వతగిరి మండలం ఏనుగల్లు ఊరచెరువు మత్తడి పోస్తోంది. ఎల్గూరు స్టేషన్ పరిధిలోని తిమ్మాపురం- ఎల్గూరు రంగంపేట గ్రామాల మధ్య రైల్వే అండర్ పాసు పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో ఆ గ్రామాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామానికి రెండు వైపులా రహదారి దిగ్బంధం కావటంతో ఎల్గూరు రంగంపేట గ్రామం జల దిగ్బంధమైంది. వరదల కారణంగా వర్ధన్నపేట తహశీల్దార్ కార్యాలయం నీట మునిగింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఆముదాల పల్లెలో గండివాగు పంట పొలాల మీదుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. గోల్లబుద్ధారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణం పూర్తిగా జలమయమై, విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామంలో ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. గద్దగుంట వాగు పొంగి, భూపాలపల్లి నుంచి రాంపూర్,గోల్లబుద్ధారం మీదుగా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదిలావుంటే గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలంగాణలోని పలు ప్రాంతాలు తడిసి ముద్దావుతున్నాయి. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక రాష్ట్రంలో బుధవారం అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, సిద్ధిపేట, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. అందుకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## అత్యుత్తమంగా పర్ఫార్మెన్స్? ఇస్తుంతన్నంత వరకు రోహిత్, విరాట్ లకు ధోకా లేదు

### టీమ్ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే కెరీర్ ఫ్యూచర్? గురించి కొన్ని రోజులుగా తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే ఈ ఇద్దరూ 2027 వరల్డ్?కప్?లో ఆడాలనుకుంటున్నప్పటికీ, దీనిపై బీసీసీఐ సుముఖంగా లేదని వార్తలు వస్తున్నాయి. 2025 ఆక్టోబర్?లో జరగనున్న ఆస్ట్రేలియా సిరీసే ఆఖరిదని ప్రచారం కూడా జరుగుతోంది. అయితే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తాజా కామెంట్స్ ఆసక్తి రేపుతున్నాయి. రోహిత్, విరాట్ వన్డే ఫ్యూచర్?పై విలేకరులు అడిగిన ప్రశ్నకు గౌతమ్ గంభీర్ నేరుగా కాకపోయినా, పరోక్షంగా సమాధానమిచ్చాడు. 2027 వన్డే వరల్డ్కప్కు ఇంకా చాలా సమయం ఉందని, ఈ మెగా టోర్నీకంటే ముందు 2026 టీ20 ప్రపంచకప్ ఉంటుందని చెప్పాడు. ప్రస్తుతం తమ ముందున్న లక్ష్యం కూడా అదేనన్నాడు. అయితే ఫామ్లో ఉండి, వీలైనన్ని ఎక్కువ పరుగులు చేసినంత వరకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకు ఎలాంటి ధోకా ఉండదని తెలుస్తోంది. "వన్డే వరల్డ్ కప్ కంటే ముందు టీ20 ప్రపంచకప్ జరగనుంది. ఇది చాలా పెద్ద టోర్నమెంట్. కాబట్టి ప్రస్తుతం మా దృష్టి మొత్తం దానిపైనే ఉంది. 2027లో జరగనున్న వన్డే వరల్డ్ కప్కు ఇంకా రెండున్నరేళ్ల టైమ్ ఉంది. అయితే అత్యుత్తమంగా పర్ఫార్మెన్స్? ఇస్తుంతన్నంత వరకు వయసు అనేది ఓ సంఖ్య మాత్రమే అని నేను ఎప్పుడూ చెబుతుంటా" అని గంభీర్ అన్నాడు. కాగా, ఈ ఏడాది



ముగిసేలోపు టీమ్ఇండియా ఆరు వన్డే మ్యాచ్?లు ఆడనుంది. అక్టోబర్లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్?లో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత నవంబర్లో సౌతాఫ్రికాతోనూ మూడు వన్డేల సిరీస్లో పాల్గొననుంది. ఇలా టీమ్ఇండియాకు 2025లో మొత్తం ఆరు వన్డే మ్యాచ్లు ఉన్నాయి. ఈ సిరీస్?ల్లో రోహిత్, విరాట్ దాదాపు బరిలోకి దిగడం ఖాయమే. అయితే ఈ సిరీస్?ల్లో ప్రదర్శన ఆధారంగానే రోహిత్, విరాట్ ఫ్యూచర్ ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు.

## ఈ ఏడాది టీమిండియా పూర్తి షెడ్యూల్ విడుదల



ఆసియా కప్ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈసారి ఆసియా కప్ యూఏఈలో సెప్టెంబర్ 9 నుండి 28 వరకు జరగనుంది. భారత క్రికెట్ జట్టు గ్రూప్ %గా%లో పాకిస్తాన్తో తలపడనుంది. ఇదే గ్రూపులో ఒమన్, యూఏఈ కూడా ఉన్నాయి. అంటే, సూపర్ 4కి భారత్, పాక్ అర్హత సాధించే బలమైన జట్లుగా ఉన్నాయి. ఒకవేళ సూపర్ 4కు చేరినా, మరోసారి భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరగనుంది. మరోవైపు సెప్టెంబర్లోనే మహిళల ప్రపంచ కప్ కూడా ప్రారంభం కానుంది. ఈ సంవత్సరం టీమ్ ఇండియా పూర్తి షెడ్యూల్, మ్యాచ్ల వివరాలు ఇక్కడ అందిస్తున్నాం. ఆసియా కప్లో మొత్తం 8 జట్లు ఆడుతున్నాయి, వీటిని నాలుగు జట్ల చొప్పున 2 గ్రూపులుగా విభజించారు. ప్రతి జట్టు తమ గ్రూప్లోని 3 జట్లతో ఒక్కో మ్యాచ్



ఆడాల్సి వస్తుంది. గ్రూప్ నుంచి రెండు జట్లు సూపర్ 4కు అర్హత సాధిస్తాయి. సూపర్ 4లో ప్రతి జట్టు ఇతర 3 జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. ఒకవేళ భారత్, పాక్ సూపర్ 4కి చేరుకుంటే.. మరోసారి దాయాదులు తలపడతాయి. ఆసియా కప్లో ఇండియా మొత్తం 6 మ్యాచ్లు ఆడుతుంది. ఫైనల్కు చేరుకుంటే, కనుక మొత్తం 7 మ్యాచ్లు అవుతాయి. సెప్టెంబర్ 14న భారత్, పాక్ మధ్య ఒక మ్యాచ్ ఖచ్చితంగా ఉంది. గ్రూప్ %గా% నుంచి భారత్, పాకిస్తాన్




సూపర్ 4కి వెళ్లే అవకాశం ఉంది, ఆ మ్యాచ్ తేదీ గ్రూప్ దశ ముగిసిన తర్వాత నిర్ణయిస్తారు. ఒకవేళ భారత్, పాకిస్తాన్ జట్లు ఫైనల్కు చేరుకుంటే, ఆసియా కప్లో భారత్, పాక్ మధ్య మొత్తం 3 మ్యాచ్లు జరుగుతాయి. 28వ తేదీన ఆసియా కప్ ముగిసిన తర్వాత, టీమ్ ఇండియా వెస్టిండీస్తో 2 టెస్ట్ మ్యాచ్లు ఆడనుంది. దీని తరువాత, ఆస్ట్రేలియా పర్యటనలో 3 వన్డేలు మరియు 5 టీ20 మ్యాచ్ల సిరీస్ ఆడబడుతుంది. ఇక్కడ విరాట్ కోహ్లీ మరియు రోహిత్ శర్మ తిరిగి వస్తున్నారు, వీరు ఇప్పుడు %ాణ×% ఫార్మాట్లో మాత్రమే ఆడుతున్నారు. దీని తరువాత భారత్-దక్షిణాఫ్రికా టెస్ట్, వన్డే మరియు టీ20 సిరీస్ ఉంటుంది. భారత మహిళల జట్టు సెప్టెంబర్లో ఆస్ట్రేలియాతో 3 మ్యాచ్ల వన్డే సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత ఇంగ్లాండ్, న్యూజిలాండ్తో 2 వార్మప్ మ్యాచ్లు ఆడనుంది. భారతదేశంలో జరగనున్న ప్రపంచ కప్లో టీమిండియా తొలి మ్యాచ్ సెప్టెంబర్ 30న శ్రీలంకతో ఉంది.

## చరిత్ర సృష్టించిన జూనియర్ ఏబీడీ!

సౌతాఫ్రికా యువ క్రికెటర్ డెవాల్డ్ బ్రెవిస్ చరిత్ర సృష్టించాడు. టీ20 క్రికెట్లో అత్యంత వేగంగా సెంచరీ సాధించిన రెండో సౌతాఫ్రికా బ్యాటర్గా నిలిచాడు. ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగిన రెండో టీ20లో 41 బంతుల్లో సెంచరీ సాధించడం ద్వారా డెవాల్డ్ బ్రెవిస్ ఈ ఫీట్ సాధించాడు. ఈ క్రమంలో అతను న్యూజిలాండ్ బ్యాటర్ మార్టిన్ గప్టిల్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డ్ను



అధిగమించాడు. గప్టిల్ ఆస్ట్రేలియాపై 49 బంతుల్లోనే శతకం సాధించాడు. సౌతాఫ్రికా తరపున



అత్యంత వేగంగా శతకాలు నమోదు చేసిన బ్యాటర్ల జాబితాలో డెవాల్డ్ బ్రెవిస్ రెండో స్థానంలో నిలిచాడు. అతనికి కన్నా ముందు డేవిడ్ మిల్లర్ ఉన్నాడు. 2017లో బంగ్లాదేశ్పై అతను 35 బంతుల్లోనే శతకం సాధించాడు. డేవిడ్ మిల్లర్, డెవాల్డ్ బ్రెవిస్ తర్వాత క్వింటన్ డికాక్(43 బంతుల్లో), రిచర్డ్ లెవెల్(45 బంతుల్లో), ఫాఫ్ డుప్లెసిస్(46 బంతుల్లో) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. టీ20 ఫార్మాట్లో సెంచరీ బాదిన సౌతాఫ్రికా యంగెస్ట్ బ్యాటర్గా నిలిచాడు. అతను 22 ఏళ్ల 105 రోజుల వయసులో ఈ రికార్డ్ సాధించాడు. బ్రెవిస్ కన్నా ముందు రిచర్డ్ లెవి 24 ఏళ్ల 36 రోజుల వయసులో సెంచరీ సాధించాడు. 2012లో న్యూజిలాండ్పై అతను శతకం సాధించాడు. జూనియర్ ఏబీడీగా అభిమానుల ప్రేమను పొందిన డెవాల్డ్ బ్రెవిస్.. 56 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 125 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆసీస్ బౌలర్లను ఊచకోత కోసాడు. దాంతో ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 218 పరుగుల భారీ స్కోర్ చేసింది. అతనికి తోడుగా ట్రిస్టన్ స్టబ్స్(22 బంతుల్లో 3 ఫోర్లతో 31) మాత్రమే రాణించాడు. ఆస్ట్రేలియా బౌలరర్లలో గ్లేన్ మ్యాక్స్వెల్(2/44), బెన్ ద్వార్షుయిస్(2/24) రెండేసి వికెట్లు తీయగా.. జోష్ హజెల్ వుడ్, ఆడమ్ జంపా చెరో వికెట్ పడగొట్టారు.

## ఆసీస్పై సౌతాఫ్రికా ఘన విజయం!

ఆస్ట్రేలియా పర్యటనలో ఎట్టకేలకు సౌతాఫ్రికా తొలి విజయాన్నందుకుంది. మూడు టీ20ల సిరీస్లో భాగంగా తొలి మ్యాచ్లో ఓడిన సఫారీ టీమ్.. ఆ పరాజయం నుంచి త్వరగానే తేరుకుంది. మంగళవారం ఆతిథ్య ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20లో 53 పరుగుల తేడాతో గెలుపొందింది. జూనియర్ ఏబీడీ, డెవాల్డ్ బ్రెవిస్ విధ్వంసకర శతకంతో సౌతాఫ్రికా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ గెలుపుతో మూడు టీ20ల సిరీస్ 1-1తో సమంగా నిలిచింది. సిరీస్ డిసైడర్ అయిన మూడో టీ20 శనివారం జరగనుంది. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 218 పరుగుల భారీ స్కోర్ చేసింది. డెవాల్డ్ బ్రెవిస్ (56 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 125 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగాడు. అతనికి తోడుగా ట్రిస్టన్ స్టబ్స్(22 బంతుల్లో 3 ఫోర్లతో 31) రాణించాడు. ఆస్ట్రేలియా బౌలరర్లలో గ్లేన్ మ్యాక్స్వెల్(2/44), బెన్ ద్వార్షుయిస్(2/24) రెండేసి వికెట్లు తీయగా.. జోష్ హజెల్ వుడ్, ఆడమ్ జంపా చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 17.4 ఓవర్లలో 165 పరుగులకే కుప్పకూలి ఓటమిపాలైంది. మరోసారి టీమ్ డెవిడ్(24 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ మిచెల్ మార్ష్(13 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్తో 22), అలెక్స్ క్యారీ(18 బంతుల్లో 3 ఫోర్లతో 26) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో క్వెనా మఫకా(3/57), కోర్బిన్ బోచ్(3/20) మూడేసి వికెట్లు తీయగా.. మార్క్రమ్, పీటర్ రబడా తలో వికెట్ తీసారు.

# వంతారా ఎంతో వింతేరా! ..

## వింతైన ఆ జంతు ప్రపంచం చూసొద్దాం రండి!


చిన్న పిల్లలకి సహజంగానే జంతువులంటే ఆకర్షణ ఉంటుంది. వాటితో చాలా తొందరగా బంధాన్ని ఏర్పరచుకోగలుగుతారు. వాళ్ల కథల్లోనూ కార్టూన్లలోనూ కూడా ఎప్పుడూ అవే ఉంటాయి. వాటికి ఎలాంటి కష్టమొచ్చినా అయ్యో అని బాధపడిపోతుంటారు.అయితే, అలాంటి ఓ పిల్లాడి అనుబంధమే నేడు 200 ఏనుగులు సహా 2000 దాకా జంతువులను కాపాడే ఓ వన్యప్రాణి సంరక్షణా కేంద్రం ఏర్పాటుకు కారణమైంది. కొన్ని వందల మంది డాక్టర్లు, నిపుణులు వాటి బాగోగులు చూసుకునే బాటయింది. రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్







అంబానీ కుమారుడు అనంత్ అంబానీనే ఆ పిల్లవాడు. ఇక, వింతైన ఆ జంతు ప్రపంచమే గుజరాత్ రాష్ట్రపు జామ్ నగరలో ఉన్న 'వంతారా జూ'!అనంత్ అంబానీకి పన్నెండేండ్ల వయసులో తల్లి నీతాతో కలిసి ఓ ఊరికి వెళుతున్నాడు. అందమైన చెట్లు, పరిగెడుతున్నాయా అనిపించే ఊళ్లూ చూస్తూ కూర్చున్నాడు అనంత్. అదే దారిలో ఓ ఏనుగు పిల్ల కనిపించిందతనికి. ఇంకేం, ఎగిరి గంతేసినంత పనిచేశాడు. కానీ పరిశీలించి చూస్తే పాపం అది ఎంతో ఇబ్బందిగా నడుస్తున్నది. మావటి వాడు దాన్ని ఎలాగోలా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు.

అది చూసిన అనంత్ మనసు చలించిపోయింది. 'పాపం కదా అమ్మా%లొ% మనం పెంచుకుందామా దాన్ని' అని అడిగాడు. 'సరే నువ్వు జాగ్రత్తగా చూసుకుంటావా మరి'%లొ%అని అడిగింది తల్లి. 'అవునమ్మా%లొ% నేను దాన్ని బాగా చూసుకుంటాను%లొ%' అని చెప్పాడా పిల్లవాడు.అలా ఆ ఏనుగు పిల్ల అనంత్ దగ్గరికి చేరింది. 'దాన్ని తీసుకున్నప్పటికి కనీసం అది ఏం తింటుందో కూడా తెలీదు' అని చెబుతాడు అనంత్. 'మావటి వాడు ఏం చెబితే అదే పెట్టేవాళ్లం. దానికి ఏమైనా అయితే చికిత్స చేయించడానికి కూడా పెద్దగా నిపుణులు అందుబాటులో లేరు. అయితే ఇన్నాళ్లలో మేం చాలా నేర్చుకున్నాం. ఆ ఒక్క ఏనుగే కాదు, ఎన్నో ఆపదలో ఉన్న జంతువులు మా దగ్గర వచ్చి చేరాయి.మరెన్నో గాయాల పాలై, ప్రాణాపాయంలో ఉన్న జీవులు ఇక్కడ కోలుకుని ఆనందంగా ఆడుకుంటున్నాయి. వాటికోసం ఎంతో పరిశోధనలు చేసి వందల సంఖ్యలో నిపుణుల్ని నియమించాం. విభిన్న జాతుల జంతువులు ఇక్కడి అడవిలో చక్కగా తిరుగుతూ ఉండటం చూస్తే ఎవరికైనా ఆనందం కలుగుతుంది'%లొ% అని తన ఈ ముందడుగు గురించి చెబుతాడు అనంత్. ఇంతకీ వంతారా అంటే ఏమిటో చెప్పలేదు కదూ%లొ% స్టార్ ఆఫ్ ద ఫారెస్ట్%లొ% అడవి చుక్క అని అర్థం!వంతారాలో మొత్తం 43 విభిన్న జాతులకు చెందిన 2000 దాకా జంతువులు ఉన్నాయి. అందులో 200 ఏనుగులు ఉన్నాయి. మంచు చిరుతలు, తెల్ల పులులతో పాటు విభిన్న రకాల చిరుతలు, పులులు, సింహాలు ఇక్కడ తిరుగుతుంటాయి. అనేక రకాల పాములు, మొసళ్లు, జిరాఫీలు, జీబ్రాలు, హిప్పోలుభారత్ సహా ప్రపంచంలోని విభిన్నప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి చేరాయి. అంతేకాదు, అంతరించిపోతున్న జాతులుగా ఉన్న దేవాంగ పిల్లి, బట్టమేక పిట్ట, రాబందు, ఒకాపి, కారకల్ లాంటి జంతు, పక్షుజాతులెన్నో ఇక్కడ తమ ఉనికిని పెంపొందించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రంలోని జామ్ నగర్‌లో మొత్తం 3000 ఎకరాల్లో ఉన్న దీనిలో ఈ జీవులన్నీ తమ కోసం కేటాయించిన విశాలమైన ప్రాంగణాల్లో సంచరిస్తుంటాయి.అడవుల నరికివేత వల్ల తమ స్థావరాలను కోల్పోవడం, వేట, స్మగ్లింగ్%లొ%లాంటి రకరకాల ప్రమాదాలకు గురయిన జంతువులే ఇవన్నీ. వేరువేరు ఆరోగ్య సమస్యలతో వచ్చే వాటిని ఇక్కడి నిపుణులైన వైద్యులు పరిశీలిస్తారు. ప్రపంచంలోనే అగ్రశ్రేణి వైద్యులు, జంతు సంరక్షణ నిపుణులతో పాటు న్యూట్రీషనిస్టులు, పాథాలజిస్టుల్లాంటి 500 మంది అంకిత భావం కలిగిన నిపుణుల బృందం వీటి జబ్బులు, గాయాలను నయం చేసేందుకు పనిచేస్తున్నది.క్రూర జంతువులా, సాధు జంతువులా, సరీసృపాలా అన్నదాన్ని బట్టి అన్ని జంతువులకూ స్వేచ్ఛగా సంచరించేందుకు సరిపడా స్థలాన్ని కేటాయిస్తారు. వీటి బాగోగులు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకునేందుకు 2100 మంది దాకా ఉద్యోగులు ఉన్నారు. 75 యానిమల్ అంబులెన్సులు కూడా ఉన్నాయిక్కడ.వంతారాలో ప్రధాన ఆకర్షణ ఏనుగులే. ఇక్కడ ఉండే 200కు పైగా గజరాజుల సంరక్షణ కోసం 25000 చదరపు అడుగుల్లో ఆసుపత్రి కట్టారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. భారీగా ఉండే ఈ జంతువులకు ఆర్థ్రైటిస్‌లాంటి ఎముకల సమస్యలు ఏర్పడుతుంటాయి. దానికి హైడ్రోథెరపీ అని చేస్తారు. కాళ్ల సమస్యలు, కీళ్ల నొప్పులు ఉండే ఏనుగులు ఇక్కడి హైడ్రోథెరపీ పూల్స్‌లో కొన్ని గంటల పాటు సేదతీరి, సాంత్వన పొందుతుంటాయి.ఇవికాక, ముల్తానీ మట్టి మసాజ్, జకుజీ (బాత్ టబ్ థెరపీ)లాంటివీ వీటి కోసం ఏర్పాటు చేశారు. ఇక, ఇందులో నివసించే జంతువుల ఆరోగ్య పరీక్షల కోసం, శస్త్ర చికిత్సలు, ఇతర చికిత్సల కోసమూ ఏర్పాట్లున్నాయి. ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్లగలిగే పోర్టబుల్ ఎక్స్-రే, లేజర్ మెషీన్‌లు, సీటీ, ఎంఆర్ఐ యంత్రాలు, ఐసీయూ, డయాలిసిస్ కేంద్రం, పాథాలజీ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లు, హైపర్ బారిక్ ఆక్సిజన్ ఛాంబర్లు ఉంటాయి. అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీలాంటివి పరీక్షలు చేసే పరికరాలూ ఇక్కడ ఉన్నాయి.కేవలం జంతువులను కాపాడి ఆరోగ్యాన్ని బాగు చేయడమే కాదు, వాటి గురించిన పరిశోధనలు జరిపే ప్రత్యేక విభాగమూ వంతారాలో ఏర్పాటయింది. ఆపదలో ఉన్న జంతువుల సంరక్షణ కోసం ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (%×ఖజచీ%), వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ లతో కలిసి పనిచేస్తున్నది వంతారా.వివిధ దేశాల్లోని జంతు సంరక్షణ కేంద్రాలతో పాటు ముఖ్యంగా మెక్సికో, వెనెజుల్లాలో ఉన్న రెస్క్యూ సెంటర్ల భాగస్వామ్యమూ ఉంది. భారత్‌లోని నేషనల్ జూ అథారిటీతోనూ టై అప్ అయ్యింది వంతారా. దేశవ్యాప్తంగా జూ లను ఏర్పాటు చేసేందుకు మంతనాలు చేస్తున్నది. ఇటీవలే ప్రధాని అధికారికంగా ఓపెన్ చేసిన ఇది, త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది.'ఆవులో మూడు కోట్ల దేవతలూ ఉంటారంటారు. నేను ప్రతి ప్రాణిలోనూ దేవుడిని చూస్తాను. వాటికి సేవ చేయడం నిజంగా అదృష్టంగా భావిస్తాను. ఎందుకంటే మనుషులకు సేవ చేసే వాళ్లు చాలామందే ఉంటారు. కానీ నోరులేని ఈ ప్రాణులకు సేవ చేసే వాళు చాలా తక్కువ. అందుకే అలాంటి జంతువుల కోసం ఈ నా ముందడుగు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.' అంటూ ప్రేమ పూర్వక గొంతుకతో చెబుతాడు అనంత్. ఆపద నుంచి గట్టెక్కిన ఎన్నో మూగజీవాలకు ఈ నీడ నిజంగా దేవుడి తోడే కదూ!









అక్షరకలం
తెలుగు దినపత్రిక





# రావు బహదూర్ కహానీ

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, నమ్రాతా శిరోద్కర్ సొంత నిర్మాణ సంస ఎంటైర్టైన్మెంట్స్ సమర్పణలో 'రావు బహదూర్' పేరుతో ఓ సైకలాజికల్ థ్రిల్లర్ రానుంది. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి వెంకటేష్ మహా దర్శకుడు. చింతా గోపాలకృష్ణారెడ్డి, అనురాగ్‌రెడ్డి, శరత్‌చంద్ర నిర్మాతలు. ప్రస్తుతం సినిమా నిర్మాణంలో ఉంది. ప్రమోషన్లో భాగంగా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. నెమలి పించాలు, అల్లుకున్న తీగ చెట్లు, చిన్న చిన్న బొమ్మల మధ్య అరిస్టోక్రాటిక్ డ్రెస్‌లో ఉన్న సత్యదేవ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు.వరల్డ్ క్లాస్ టెక్నికల్ స్టాండర్డ్స్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని, ఓ రాజవంశం నేపథ్యంలో కథ నడుస్తుందని, భావోద్వేగాలతో కూడుకున్న చారిత్రాత్మక సంస్కృతిని ఇందులో చూడబోతున్నారని, గ్లోబల్ ఆడియన్స్ మెచ్చేలా సినిమా ఉంటుందని దర్శకుడు వెంకటేష్ మహా తెలిపారు.



# ఢిల్లీ అబ్బాయి.. కేరళ అమ్మాయి

సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీకపూర్ జంటగా నటించిన తాజా చిత్రం 'పరమ్ సుందరి' ఈ నెల 29న విడుదలకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే ఈ సినిమా తాలూకు పాటలు, ప్రచార చిత్రాలు భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మంగళవారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఢిల్లీ అబ్బాయి పరమ్, కేరళ అమ్మాయి సుందరి మధ్య ప్రేమకథ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. ట్రైలర్ ఆద్యంతం వినోదప్రధానంగా ఆకట్టుకుంది.కేరళ తాలూకు విజువల్స్ కట్టిపడేశాయి. భిన్న సాంస్కృతిక నేపథ్యం కలిగిన ఓ జంట ప్రేమ ప్రయాణానికి అందమైన దృశ్యరూపమిదని చిత్ర దర్శకుడు తుషార్ జలోటా తెలిపారు. ఈ సినిమా వ్యక్తిగతంగా కూడా బాగా కనెక్ట్ అయిందని, తాను పోషించిన సుందరి పాత్ర తన దక్షిణాది మూలాలు, ఘనమైన వారసత్వాన్ని గుర్తుచేసేలా ఉంటుందని జాన్వీకపూర్ తెలిపింది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.





# పరదా ప్రమోషన్స్ టైం..

అనుపమ ఆ తర్వాత తమిళ, మలయాళ సినిమాలతో బిజీగా మారిపోయింది. ప్రస్తుతం అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న తెలుగు చిత్రం 'పరదా' మలయాళ నటి దర్శన, సంగీత కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా బండి ఫేం ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ ఆగస్టు 22న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.ఈ నేపథ్యంలో ప్రమోషనల్ టూర్స్‌తో బిజీగా ఉంది అనుపమ టీం. నేడు పరదా ప్రమోషన్స్‌లో భాగంగా ఏలూరులోని రామచంద్ర ఇంజినీరింగ్ కాలేజీని సందర్శించింది. అనుపమ పరమేశ్వరన్ ఈ సందర్భంగా రెడ్ డ్రెస్‌లో కుందనపు బొమ్మలా మెరిసింది. స్టేజ్‌పై నుంచి అందరికీ హాయ్ చెబుతూ.. విద్యార్థులతో కలిసి సెల్ఫీలు దిగింది. చిరునవ్వుతో కట్టిపడేస్తున్న అనుపమ పరమేశ్వరన్ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# మెగా కోడలి మూవీ నుండి విడుదలైన పెళ్ళి పాట..

వరుణ్ తేజ్‌ని వివాహం చేసుకున్న లావణ్య త్రిపాఠి ఇప్పుడు స్లో అండ్ స్టడీగా సినిమాలు చేస్తుంది. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో లావణ్య త్రిపాఠి తాజాగా చేస్తున్న చిత్రం సతీ లీలావతి. దేవ్ మోహన్ ప్రధాన పాత్రలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై తాతినేని సత్య దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందగా, తాజాగా మూవీ నుండి 'చిత్తూరు పిల్ల' అంటూ సాగే పాట విడుదల చేశారు. పాటకు వనమాలి హృద్యమైన సాహిత్యాన్ని అందించగా,సంగీతాన్ని మిక్కీ జే మేయర్ స్వరపరిచారు.బృందా మాస్టర్ అందించిన నృత్యాలు పాటను మరింత ఆకర్షణీయంగా మార్చాయి.ఈ మెలోడియస్ ట్రాక్‌ను నూతన మోహన్, కృష్ణ తేజస్వి, రితేష్ జీ రావ్ ఆలపించారు.పెళ్లి సంబరాల్లో ఈ పాటను ప్లే చేసేలా మేకర్లు తెరకెక్కించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న 'సతీ లీలావతి' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ముందుగా అనుకున్న ప్లానింగ్ ప్రకారం మేకర్స్ సినిమాను శరవేగంగా పూర్తి చేసి సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఫీల్ గుడ్ మూవీగా అందరినీ ఆకట్టుకునేలా, అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

# రూమర్లను నమ్మకండి

జయాపజయాలకు అతీతంగా కెరీర్‌లో దూసుకుపోతున్నది తెలుగమ్మాయి శ్రీలీల. ప్రస్తుతం ఆమె హిందీలో 'ఆషికీ 3' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. కార్తీక్ ఆర్యన్ ఇందులో కథానాయకుడు. ఈ సినిమాలోని శ్రీలీల పాత్ర విషయంలో బీ టౌన్‌లో ఓ రూమర్ మొదలైంది. వివరాల్లోకెళ్తే. రీసెంట్‌గా విడుదలైన 'సైయారా' చిత్రం ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఇందులో హీరోయిన్ అల్జిమర్ వ్యాధితో బాధపడుతుంటుంది. అక్కడ్నుంచే కథ మలుపు తిరుగుతుంది. ప్రస్తుతం శ్రీలీల నటిస్తున్న 'ఆషికీ 3' కథ కూడా దాదాపు ఈ తరహాలోనే సాగుతుందనేది ఆ రూమర్ సారాంశం. దీనిపై ఇటీవల శ్రీలీల స్పందించింది. "సైయారా'కూ మా సినిమాకూ ఏ సంబంధమూ లేదు. కథానుగుణంగా ఇందులో నాకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవు. అవన్నీ రూమర్లు. నమ్మకండి' అంటూ చెప్పుకొచ్చారు శ్రీలీల. ఆమె కథానాయికగా తెలుగులో నటించిన 'మాస్ జాతర' ఈ నెల 27న విడుదల కానున్న విషయం తెలిసిందే.





# సిఎస్ఆర్ నిధులు తో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి - కలెక్టర్ పి ప్రావీణ్య

- కలెక్టర్ అధ్యక్షతన సిఎస్ఆర్ కమిటీ సమావేశం.



**సంగారెడ్డి ప్రతినిధి, అక్షర కలం :**

జిల్లాలో సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ లో సిఎస్ఆర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల నుండి సిఎస్ఆర్ నిధులు సేకరించాలని ,జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ను కలెక్టర్ ఆదేశించారు. గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో ఉన్న అన్ని పరిశ్రమలు సిఎస్ఆర్ నిధులు ఎంత మేరకు ఖర్చు చేశాయి ,అన్న వివరాలు అందజేయాలని పరిశ్రమల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంకా సిఎస్ఆర్ నిధులు ఎన్ని నిధులు మిగిలి ఉన్నాయో సేకరించి, విద్య, వైద్య ఆరోగ్య వంటి అవసరమైన విభాగాలకు కేటాయించేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ , %జూ=% క్లస్టర్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. సి ఎస్ ఆర్ నిధులతో జరుగుతున్న పనులు, ఇంకా ప్రారంభం కాని పనుల వివరాలను , సి ఎస్ ఆర్ నిధులు వినియోగిస్తున్న శాఖల నుంచి సేకరించేందుకు జిల్లా ప్రణాళిక అధికారికి ఆదేశాలు ఇచ్చారు. విద్యాశాఖలో సిఎస్ఆర్ నిధులతో అనుమతించబడిన పనుల వివరాలను జిల్లా విద్యాధికారి అందజేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో అనుమతించబడిన పనుల వివరాలను జిల్లా వైద్యాధికారి అందించాలి. సిఎస్ఆర్ నిధులతో పనులు చేపట్టే అర్హత కలిగిన కంపెనీల వివరాలు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి అందుబాటులో ఉండే సిఎస్ఆర్ నిధుల వివరాలు సేకరించాలని సిఎస్ఆర్ కమిటీ సభ్యులకు ఆదేశించారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, అవసరమైతే సంబంధిత శాఖలకు స్వాధీనపరచాలని సూచించారు. అలాగే, జిల్లాలో అవసరమున్న పనులను గుర్తించి, వాటి వివరాలను సిఎస్ఆర్ కమిటీకి నివేదిక రూపంలో సమర్పించాలన్నారు. సిఎస్ఆర్ నిధులతో జరుగుతున్న పనుల నాణ్యత, నిర్మాణ ప్రమాణాలను ఈ ఈ సోషల్ వెల్ఫేర్ , సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులు తనిఖీ చేయాలన్నారు. తదుపరి సమావేశానికి సిఎస్ఆర్ నిధులకు సంబంధించిన సమగ్రంగా వివరాలను సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, సి పి ఓ బాలశౌరి, డి ఏ ఓ వెంకటేశ్వర్లు, డి ఐ ఈ ఓ గోవిందరావు, డి ఏం %ఉ%హెచ్ ఓ, నాగ నిర్మల సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నషా ముక్త్ భారత్ అభియాన్, మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణం

**అక్షర కలం ఆగస్టు 13 ప్రతినిధి సూర్యాపేట**

సూర్యాపేట జిల్లా కేంద్రం.. సూర్యాపేట పట్టణంలో గల జయ పాఠశాల నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం నందు జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు హాజరై మాట్లాడారు. డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వామ్యం అవుతామని, దృఢమైన సమాజ నిర్మాణం లో భాగస్వామ్యం అవుతామని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన ఆలోచనలను, అలవాట్లను నియంత్రనలో ఉంచుకోవాలని, విద్యార్థులు స్వీయ నియంత్రణ కలిగి



ఉండాలని అన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజంగా తీర్చిదిద్దడంలో విద్యార్థులు, పౌరులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని తెలిపారు. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నామని అన్నారు. యువత జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి కష్టపడి చదవాలని తల్లిదండ్రులు గురువుల మాటలు వింటూ వారి బాటలో పయనిస్తూ తమ ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని అన్నారు, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ చెప్పినట్లుగా దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉందన్నారు, ఆలాంటి యువత డ్రగ్స్ మత్తులో భవిష్యత్తు కోల్పోతున్నారు అన్నారు, డ్రగ్స్ మత్తులో యువశక్తి నిర్వీర్యం అవుతంది అన్నారు.. దేశ ప్రగతికి యువత పునాదని అన్నారు. యువత కష్టపడి చదవాలని తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని, చెడు మార్గంలో పయనించవద్దని కోరారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ కు బానిసలు కావద్దని ఎవరైనా చెడు మార్గంలో వెళ్తున్నప్పుడు తల్లిదండ్రులు దండిస్తారని, వారి మాటల విని చెడు స్నేహాలను వదులుకోవాలని అన్నారు. యువత కష్టాలను ఎదుర్కొని విజయాలు సాధించడానికి కృషి చేయాలని అన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం ఏపీజే అబ్దుల్ కలాం గారి జీవితం సాధించిన విజయాల గురించి వివరించి విద్యార్థులను మోటివెట్ చేశారు జీవితంలో ఒక ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని వాటి సాధన కోసం నిరంతరం కూడా కృషి చేయాలని ఆయన అన్నారు... మనం ఏదైనా సాధించాలంటే ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకుని క్రమశిక్షణతో కష్టపడాలని నీకు నీవే యుద్ధానికి తయారు కావాలని, మీ అందరిని మంచి పౌరులుగా చూడాలన్నది మా ఆశ ఆకాంక్ష అని అన్నారు. విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులది అయితే, సమాజంలో నేర ప్రవృత్తి కలిగిన వారిని సత్ప్రవర్తన కలిగిన పౌరులుగా మార్చడం పోలీసుల విధి అన్నారు. మాదకద్రవ్యాల ప్రభావము సోషల్ మీడియా ప్రభావము రోడ్డు ప్రమాదాలు ఇలా సామాజిక అంశాలపై పోలీసు కళాబృందం పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సైలు ఏడుకొండలు శివతేజ పాఠశాల యజమాన్యం ప్రిన్సిపాల్ ఉపేందర్ ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి – అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**ఆగస్టు 27 నుంచి గణేష్ ఉత్సవాలు**

**విగ్రహాల ఏర్పాటు సమాచారం తప్పని సరిగా అందించాలి**

**గణేష్ ఉత్సవాలు, వినాయక నిమజ్జనం తదితర అంశాలపై ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్**




**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించడానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వినాయక చవితి సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డి.ఆర్.ఓ. పద్మశ్రీ లతో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు గణేష్ ఉత్సవాలు ఈ సంవత్సరం జరుగనున్నాయని, ఆ రోజులలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గణేష్ మండపాల వారు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా అందరూ గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని, ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గణేష్ మండపాలకు ప్రభుత్వం విద్యుత్ సరఫరా చేస్తుందని, జియో కో-ఆర్డినేట్స్ తో సహా మండపాల వివరాలు అందించాలని అన్నారు. గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలని, గణేష్ విగ్రహం నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని, నిమజ్జనం రూట్ లో అవసరమైన రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. గణేష్ నిమజ్జనం పాయింట్ల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో పెట్టుకోవాలని, త్రాగునీటి సరఫరా, లైటింగ్, బ్యారికేడ్ల ఏర్పాటు, మొబైల్ టాయిలెట్ వంటి సదుపాయాలను కల్పించాలని అన్నారు. గణేష్ నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో అవసరమైన మేర క్రేన్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని అన్నారు. నిమజ్జనం వద్ద అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అగ్ని మాపక వాహనాలు ఏర్పాటు చేయాలని అన్నారు. నిమజ్జనం జరిగే రోజు లిక్కర్ షాప్ లు మూసి వేయాలని అన్నారు. జిల్లాలోని డి.ఎల్.పి.ఓ లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా చేపట్టాల్సిన ప్రత్యేక పారిశుద్ధ్య చర్యల గురించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతో కలిసికట్టుగా అందరూ సహకరించి పండుగ వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించేలా చూడాలని అదనపు కలెక్టర్ అన్నారు.గత ఏడాది మట్టి విగ్రహాలను ప్రోత్సహించిన విధానం ఈ సంవత్సరం కూడా కొనసాగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమీషనర్ అనిల్ కుమార్, మున్సిపల్ కమీషనర్లు, వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు వరద ప్రవాహాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి : పి ప్రావిణ్య జిల్లా కలెక్టర్

**- ఎస్పీ పరితోష్ పంకజ్ తో కలిసి వరద ప్రభావ ప్రాంతాల పరిశీలన చేసిన కలెక్టర్.**

**- గర్భిణీ స్త్రీలను ముందుగానే సమీప ఆసుపత్రులకు తరలించాలి.**

**- బ్రిడ్జిలు వాగులు వంకల వద్దకు ప్రజలు వెళ్ళరాదు .**

**- అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు రావద్దు.**

**- కంట్రోల్ రూమ్ నెంబర్ 08455 276155**





**సంగారెడ్డి ప్రతినిధి, అక్షర కలం :**

జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వాగులు వంకలు పొంగి పొర్లు తున్నాయని ఈ వరదల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. జిల్లా ఎస్పీ పరి తోష్ పంకజ్ తో కలిసి కలెక్టర్ బుధవారం జహీరాబాద్ నుండి బూచినెల్లి గ్రామం వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జిని కలెక్టర్ పరిశీలించారు. నారింజ వాగు నుండి వచ్చే వరదను ఎస్పీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులు, నారింజవాగు పరివాహక ప్రాంతం వివరాలను తెలిపే మ్యాపు ద్వారా కలెక్టర్కు వరద ఉధృతిని వివరించారు. భారీ వర్షాల కారణంగా జహీరాబాద్ న్యాల్కల్ తదితర ప్రాంతాల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంతాలలో స్థానిక పరిస్థితులను కలెక్టర్ ఎస్పీలు సమీక్షించారు. భారీ వర్షాలు ఈదురుగాలును వరద ప్రవాహాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా నదులు ,వాగులు ,చెరువులు, కల్వర్టులు, బ్రిడ్జ్ ల వద్దకు ప్రజలు వెళ్లకూడదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులలో తప్ప , ప్రయాణాలు చేయకూడదని సూచించారు . అన్ని శాఖల అధికారులు సిబ్బంది, తమ కార్యస్థానాలలో అందుబాటులో ఉండి ప్రజలకు తక్షణ సహాయక చర్యలు అందించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు , గాలులు ఎక్కువగా ఉన్న సమయంలో విద్యుత్ స్తంభాలు వైర్లు ట్రాన్స్ఫార్మర్లు తాకరాదని కరెంటు ప్రమాదాల నుండి రక్షణ కోసం అందరూ సరైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఎస్పీలు న్యాల్కల్ మండలం నారింజ వాగుకు వర్షానికి వచ్చే వరదను కలెక్టర్ ఎస్పీలు పరిశీలించారు. నారింజ ప్రాజెక్టు నీటి సామర్థ్యం ఎంత ఉంది అని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు వాగు దగ్గరికి ఎవరు రాకుండా చర్యలు తీసుకోవాలని నేటిపారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. వాగు కు వరద ఏ ప్రాంతాల నుండి వస్తుంది వరద ఉధృతి ఎంత ఉండొచ్చు అనే విషయాలను నీటిపారుదల శాఖ అధికారులు నరింజ వాగు ప్రవహించే ఏరియా ను మ్యాపు ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మండలంలోని రాయిపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారి బ్రిడ్జిలు జిల్లా కలెక్టర్ ఎస్పీలు నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షాల కారణంగా ఎక్కడైనా అడ్డంకులు రహదారిలో దెబ్బతినే ప్రమాదం ఉంటే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. భారీ వర్షాలు దృష్ట్యా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వర్షాల వల్ల ఇబ్బందులు కలిగిన వరద పరిస్థితిలో ఉంటే వెంటనే కలెక్టరేట్లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 08455 - 276155 కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య , బూచి నెల్లి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలో గర్భిణీ స్త్రీలను గుర్తించి వర్షాల కారణంగా అనుకోని అత్యవసర పరిస్థితులు తలెత్తకుండా ముందుగానే వారిని సమీప ఆసుపత్రులకు తరలించాల్సిందిగా ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భముగా జహీరాబాద్ ఆర్డీఓ రాం రెడ్డి , తహసీల్దార్ దశరథ్ ,నీటి పారుదల శాఖ అధికారులు ,రెవెన్యూ అధికారులు ఉన్నారు.

# ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

**పట్టణంలో భారీ తీరంగ జెండా ర్యాలీవాసవి క్లబ్ అధ్యక్షుడు రవితేజ ఆధ్వర్యంలో**

**అక్షర కలం ఆగస్టు 13 సూర్యాపేట ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా కేంద్రం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో తిరంగా జెండా ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షుడు వెంపటి రవితేజ, మాట్లాడుతూ ప్రతి ఇంటిపై భారతీయ జాతీయ జెండా ఎగరాలని ఇదే దేశ ప్రజల జెండాతో హృదయపూర్వక సంబంధాన్ని తద్వారా ప్రతి ఒకరిలో జాతీయ భావం పెరిగిపోతుందని అన్నారు కొత్త బస్టాండ్ నుంచి కల్నల్ సంతోష్ బాబు విగ్రహం వరకు 104 అడుగుల భారీ జాతీయ జెండా విద్యార్థులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ వారు విద్యార్థులు పాల్గొన్నారు.




# కెప్టెన్ అంటే శుభ్‌మన్ లా ఉండాలి

**గిల్‌పై సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు**

టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు కురిపించాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీలో శుభ్‌మన్ గిల్ పాల్గొననుండటం గొప్ప విషయమని కొనియాడాడు. ఇది భారత క్రికెట్‌కు శుభపరిణామమని చెప్పిన లిటిల్ మాస్టర్.. యువ క్రికెటర్లకు మంచి సంకేతాలను ఇస్తుందని పేర్కొన్నాడు. కెప్టెన్ అంటే ఇలా ఉండాలని శుభ్‌మన్ గిల్ చాటి చెప్పాడని మెచ్చుకున్నాడు.అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు లేనప్పుడు భారత ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ ఆడాటాన్ని బీసీసీఐ తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా చేతిలో టీమిండియా 3-1 తేడాతో ఓడిన తర్వాత బీసీసీఐ ఈ నిబంధనను తీసుకొచ్చింది. దాంతోనే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ దాదాపు దశాబ్దం తర్వాత రంజీట్రోఫీ ఆడారు. శుభ్‌మన్ గిల్ కూడా దులీప్ ట్రోఫీలో బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. అతను నార్త్ జోన్ జట్టును నడిపించనున్నాడు.తాజాగా ఈ విషయంపై స్పందించిన గవాస్కర్.. గిల్ నిర్ణయాన్ని ప్రశంసించాడు. 'దులీప్ ట్రోఫీలో శుభ్‌మన్ గిల్ పాల్గొననుండటం మంచి నిర్ణయం. బంగ్లాదేశ్ పర్యటన మరుసటి ఏడాదికి వాయిదా పడింది. అలాగే శ్రీలంకతో కూడా ఎలాంటి సిరీస్ లేదు. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ.. దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యమిచ్చింది. దాంతో టీమిండియా టాప్ ఆటగాళ్లంతా దులీప్ ట్రోఫీ ఆడనున్నారు. శుభ్‌మన్ గిల్ నార్త్ జోన్‌కు సారథ్యం వహించనున్నాడు. ఈ టోర్నీకి అందుబాటులో ఉండి, ఇతర ఆటగాళ్లకు శుభ్‌మన్ గిల్ ఆదర్శంగా నిలుస్తున్నాడు. అయితే ఇంగ్లండ్ సిరీస్‌లో పాల్గొన్న టీమిండియా ఫాస్ట్ బౌలర్లు దులీప్ ట్రోఫీకి దూరంగా ఉండటం మంచి నిర్ణయమే.'అని సునీల్ గవాస్కర్ చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో అటు కెప్టెన్‌గా.. ఇటు బ్యాటర్‌గా శుభ్‌మన్ గిల్ సత్తా చాటాడు. 754 పరుగులతో రాణించాడు. ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. 1971లో సునీల్ గవాస్కర్ ఓ సిరీస్‌లో 774 పరుగులు చేసి టాప్‌లో కొనసాగుతున్నాడు.

# గౌరీ కుంట తండాను సందర్శించిన ఎమ్మెల్యే బాలునాయక్.



అక్షర కలం,కొండమల్లేపల్లి.

కొండమల్లేపల్లి మండల పరిధిలో సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు మండల పరిధిలో గల గౌరీ కుంట తండా జలమయమయ్యాయి. బుధవారం రోజు న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వర్షానికి జలమయమైన ఇండ్లను పరిశీలించారు. తహసిల్దార్ ఎంపీడీవో ఇరిగేషన్ అధికారులతో కలిసి గౌరీ కుంట తండా సందర్శించి పరిశీలించారు. ఇక ముందు వరద నీరు తండాలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు అవసరమైన నిధులు వెంటనే చెల్లించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వరదలు చేరిన కుటుంబాలలో ఎవరైనా అర్హులు ఉంటే వారికి ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా చూస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు రెడ్డి, తహసిల్దార్ నరేందర్, ఆర్ ఐ శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ అధికారులు, నాయకులు పిఏసిఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, ఉట్కూరి వేమన్ రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, కుంభం శ్రీనివాస్ గౌడ్, రమావత్ భాస్కర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చేయి తడపనిదే పని జరగదు. ఇది మల్లెపల్లి గ్రామపంచాయతీ అధికారుల పనితీరు.

అక్షర కలం,కొండ మల్లెపల్లి.

కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పనిచేసే అధికారుల పనితీరు మనుషులను బట్టి మారుతుంది. డబ్బులు ఉన్న వారికి ఒక తీరు పేదవారికి ఇంకో తీరు ఏదైనా పని కోసం గ్రామపంచాయతీకి వెళితే అక్కడ ఏ అధికారి అందుబాటులో ఉండడు. ఒకవేళ సామాన్య ప్రజలు ఏదైనా సమస్య కోసం గ్రామ పంచాయతీకి వస్తే వాళ్లు వచ్చేవరకు ఎదురు చూడవలసిందే వచ్చిన తర్వాత ఏదైనా ఇంటి నిర్మాణానికి అనుమతి అడిగితే డబ్బులు ఇవ్వకుండా ఫైలు ముందలికి జరగదు. బడా బాబులు కుంటలు కప్పి ఇల్లు కట్టుకున్న వీరికి కనబడదు ఒక వ్యక్తి ఇంటి నిర్మాణం అనుమతి గురించి పత్రాలు సమర్పించి నెల నుంచి తిరుగుతున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఒక పంచాయతీ కార్యదర్శి మల్లెపల్లి గ్రామపంచాయతీలో దాదాపు 6 సంవత్సరాలు పనిచేయడం ద్వారా తెలుస్తుంది మల్లెపల్లి గ్రామపంచాయతీ లోని ఆదాయం. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గ్రామపంచాయతీ అధికారులకు ఎవరికి కనబడదు. కఠిన చర్యలు తీసుకుంటాం మల్లె పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ఇలాంటి సంఘటనలు తమ దృష్టికి తీసుకు రాలేదని ఒకవేళ తమ దృష్టికి వచ్చినచో వారిపైచట్ట పరమైన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

# ఎంపీ వద్దిరాజు నూతన వధూవరులకు ఆశీస్సులు



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నూతన వధూవరులు శంతను–తేజస్వి త్రిపురాంబికలకు ఆశీస్సులు అందజేశారు.ప్రముఖ న్యాయవాది, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమ భరత్ కుమార్ –పద్మ దంపతుల కుమారుడు శంతను పెళ్లి పసుమర్తి అంబికా లక్ష్మీనర్సింహా ప్రసాద్–శోభారాణి దంపతుల కుమార్తె తేజస్వి త్రిపురాంబికతో బుధవారం ఘనంగా జరిగింది.శామీర్ పేట ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ పెళ్లికి ఎంపీ రవిచంద్ర,మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు,వీ.శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్సీ ఏల్.రమణ,జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వీ.ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తదితర ప్రముఖులతో కలిసి హాజరై అక్షింతలు వేసి, పుష్పగుచ్ఛమిచ్చి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు వెంట సన్నిహితులు మరికల్ పోత సుధీర్ కుమార్,చందు జనార్ధన్, జెన్నాయికోడే జగన్మోహన్ తదితరులు ఉన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ జిల్లా అధికారులను ఆదేశించారు.

అక్షర కలం /ప్రతినిధి :

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై బుధవారం ఆయన జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈనెల 15 న ఉదయం 9:30 గంటలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ సంవత్సరపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా జాతీయ పతాకావిష్కరణ, అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి సందేశం ఉంటుందని, ప్రభుత్వ అభివృద్ధిని ప్రస్ఫుటించే విధంగా శకటాలను ప్రదర్శిస్తారని, పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రధానం ,ఆయా పథకాల కింద లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ ఉంటుందని, అంతేకాక ఆయా శాఖల అభివృద్ధిని తెలిపే విధంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించడం జరుగుతుందని తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లలో భాగంగా మరోసారి ఆయా శాఖల అధికారులు వారికి ఇదివరకే ఆదేశించిన విధులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వర్తించాలని చెప్పారు. ముఖ్యంగా సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని విద్యార్థులు 9 గంటల లోపు పరేడ్ గ్రౌండ్ కి వచ్చేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. స్వతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ముఖ్య అతిథులకు పంపించాలని ఆర్డీవోను ఆదేశించారు. వర్షానికి ఇబ్బంది పడకుండా రైన్ ప్రూఫ్ టెంట్లు వేయించాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీరు ,ఇతర అన్ని ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆయన ఆదేశించారు.ఈ టెలికాన్ఫరెన్స్ లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, అడిషనల్ ఎస్పీ రమేష్ ,జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం ..ఏఐటీయూసీ,రైతు సంఘం.




నల్లగొండ అక్షర కలం ప్రతినిధి :

కేంద్రం ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తూ, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చి రైతులకు ప్రజలకు ప్రజా పంపిణీ పథకాలను పాతరవేసే దిశలో అడుగులు వేస్తున్నందుకు నిరసనగా ఈనెల 13వ తేదీన దేశవ్యాప్త పిలుపులో భాగంగా నల్లగొండ సుభాష్ విగ్రహం దగ్గర ఏఐటీయూసీ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ,తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజా రామచంద్రం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచి పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయటం సిగ్గుచేటని అన్నారు.ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు సమూలంగా మార్చివేస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి పెట్టుబడిదారులకు కార్పొరేటర్లకు అనుకూలంగా తీసుకొని రావడం విచారకరమని అన్నారు. దేశ సంపద సృష్టించే కార్మిక వర్గము నోట్లో మట్టి కొడుతూ ధనవంతుల కొమ్ముగాస్తున్న ప్రభుత్వం విధానాలు తిప్పి కొట్టాలని అన్నారు. నిత్యావసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే నియంత్రించడం చేతగాని ప్రభుత్వం అమెరికా భారత వస్తువులపై సుంకాలు పెంచుతున్న నిమ్మకు నేరెత్తినట్లు వివరిస్తుందని ఆరోపించారు. అమెరికా సామ్రాజ్యవాద అడుగులకు మడుగులొత్తుతూ దేశ సార్వభౌమత్వాన్ని ట్రంప్ కు తాకట్టు పెట్టే విధంగా ప్రధానీ విధానాలు ఉన్నాయని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేస్తూ రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పోరేటు నినాదంతో దేశవ్యాప్తంగా పోరాటాలను తీవ్రతరం చేస్తామని కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటాలు నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోకపోతే వాటిని రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు. 8 గంటల పని విధానం రద్దుచేసి 12 గంటల పని విధానం తీసుకొచ్చి శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు రైతు కార్మిక వ్యతిరేక విధానాలు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గీతా పనివారల సంఘం జిల్లా కార్యదర్శి పబ్బు వీరస్వామి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కేవీఎస్ రెడ్డి కోశాధికారి దోనకొండ వెంకన్న, సహాయ కార్యదర్శి బరిగల వెంకటేష్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండమీద వెంకన్న, యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, గుండె రవి, శంకర్ ,లెనిన్, ఏం ముత్యాలు, నందం, సత్యనారాయణ రామకోటి, వెంకటయ్య దోటి పండరి , యూసుఫ్ మదార్, విజయ్ రెడ్డి, అక్కలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడుగా యలమందుల జగదీష్





౦- ఏకగ్రీవంగా ఎన్నికైన జగదీష్ ను అభినంధించిన రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు నరాల రుక్మారావు, రఫీ

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:


ఖమ్మం: తెలంగాణ రాష్ట్ర మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడుగా యలమందల జగదీష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆ సంఘం పౌండర్ శికిలంభట్ల యాదగిరి, రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు నరాల రుక్మారావు, రఫీ లు పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని రెడ్డిగూడెం – మారెమ్మతల్లి గుడివద్ద బుధవారం తెలంగాణ రాష్ట్ర మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘ ఫౌండర్ శికిలంభట్ల యాదగిరి, రాష్ట్ర అధ్యక్షులు నరాల రుక్మారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ... అసోసియేషన్ లో సీనియర్ గా నిబద్ధత కలిగి పనిచేస్తున్న ఖమ్మం జిల్లా కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన యలమందల జగదీష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన జగదీష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మ్యారేజ్ బ్యూరోల మీడియేటర్ ల సమస్యల పరిష్కారం కోసం, అదేవిదంగా సంఘం బలోపేతం కోసం నిరంతరం పనిచేస్తానని, ఎక్కడో ఉన్న అమ్మాయిని, మరెక్కడో ఉన్న అబ్బాయిని కలిపి వివాహం చేయడం అది ఎంతో పుణ్యకార్యమని అన్నారు. సమాజంలో 26ఏళ్లుగా అనుభవమున్న తనను అధ్యక్షునిగా, మహ్మద్ ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ పెద్దలు తన మీద పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘం అభివృద్ధికి తోడ్పడతానని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, బాబు, వెంకటనారాయణ, చంద్రకళ, సంధ్యారాణి, కర్నాటి నాగమణి, నాగలక్ష్మి, వెంకటలక్ష్మీ, అనూష తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహా లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలి

నల్లగొండ, అక్షర కలం/ ప్రతినిధి:

బుధవారం ఆయన నల్గొండ జిల్లా, తిరుమలగిరి సాగర్ మండలంలోని నాయకుని తండా, తిమ్మాయిపాలెం, నెల్లికల్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లను తనిఖీ చేశారు.ఆయా గ్రామాలలో ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ స్టీలు, సిమెంటు వంటివి ఎక్కువగా వాడడం వల్ల ఇంటి వ్యయం పెరుగుతుందని,అలాగే నిర్దేశించిన కొలతలు కాకుండా ఎక్కువ కొలతలతో ఇళ్ళు నిర్మించుకున్నా వ్యయం పెరిగే అవకాశం ఉందని,అందువల్ల నిర్దేశించిన ప్రకారమే ఇల్లు నిర్మించుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే దశలవారిగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని చెప్పారు.గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు, తదితరులు ఉన్నారు .







# డివి శంకర్రావుని అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

అక్షర కలం /భద్రాచలం

పవర్ లిఫ్టింగ్ ఇండియా చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించి వచ్చిన క్రీడాకారున్ని అభినందించిన భద్రాద్రి జిల్లా ఎస్పీ

భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి. కేరళ రాష్ట్రంలో ఆగస్టు 2 నుండి 7 వరకు నిర్వహించిన జాతీయస్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో నాలుగు బంగారు పతకాలు సాధించిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డివి శంకర్రావుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 73 సంవత్సరాల వయసులో హార్ట్ బైపాస్ సర్జరీ సైతం లెక్కచేయకుండా ఆరు నెలల అనతి కాలములోనే జిల్లా, రాష్ట్ర స్థాయిలను అధిగమించి, జాతీయ స్థాయిలో నాలుగు బంగారు పతకాలను గెలుచుకొని చరిత్ర సృష్టించిన ఘనత భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డివి శంకర్ రావు అని తెలిపి పవర్ లిఫ్టింగ్ ఇండియా చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించారని తెలిపారు. అంతేకాకుండా ఆరోగ్య సమస్యలు జీవితాన్ని నిర్వచించలేవని , బలానికి వయసు అడ్డు కాదని, సంకల్పం అడ్డంకులను మైలురాళ్లుగా మారుస్తుందని తెలిపారు. ఈ విజయం వృద్ధాప్యానికి పరిమితం కాకుండా కొత్త అవకాశాలుగా చూడాలని సందేశాన్ని అన్ని వయసుల వారికి అందిస్తుందని తెలిపారు.



# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దు

అత్యవసర సమయాల్లో డయల్ 100

..పోలీస్ కమిషనర్ సునీల్ దత్



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలోప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని,వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దనిపోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ప్రధానంగా వాగులు వంకలన్నీ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రోడ్లు జలమయమయ్యే ప్రాంతాలలో ప్రజలు రోడ్డు దాటే ప్రయత్నం చేయవద్దనిసూచించారు.పిల్లలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా చేపాల వేటాకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు చెరువులు, వాగులు దాటవద్దని పెర్కొన్నారు. యువకులు సెల్ఫీల కోసం నీటి ప్రవాహం వద్దకు వెళ్లవద్దని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు, స్థానిక పోలీసులకు, పోలీస్ కంట్రోల్ సెల్ నెంబర్ 8712659111 సమాచారం ఆందిచాలని సూచించారు. ఇప్పటికే చెరువులు, వాగుల వద్ద పెట్రోలింగ్ పెంచి ప్రమాద హెచ్చరికలను తెలియజేసేలా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని వంతెనలు, చప్టలపై బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల భారీన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధించాలని పోలీస్ అధికారులకు సూచించామని తెలిపారు. ఎగువ ప్రాంతంలో అధిక వర్షాల మూలంగా వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, ఈ దష్ట్యా అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు.

# చేయి తడపనిదే పని జరగదు. ఇది మల్లెపల్లి గ్రామపంచాయతీ అధికారుల పనితీరు.



అక్షర కలం,కొండ మల్లెపల్లి.

కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పనిచేసే అధికారుల పనితీరు మనుషులను బట్టి మారుతుంది. డబ్బులు ఉన్న వారికి ఒక తీరు పేదవారికి ఇంకో తీరు ఏదైనా పని కోసం గ్రామపంచాయతీకి వెళితే అక్కడ ఏ అధికారి అందుబాటులో ఉండడు. ఒకవేళ సామాన్య ప్రజలు ఏదైనా సమస్య కోసం గ్రామ పంచాయతీకి వస్తే వాళ్లు వచ్చేవరకు ఎదురు చూడవలసిందే వచ్చిన తర్వాత ఏదైనా ఇంటి నిర్మాణానికి అనుమతి అడిగితే డబ్బులు ఇవ్వకుండా ఫైలు ముందలికి జరగదు. బడా బాబులు కుంటలు కప్పి ఇల్లు కట్టుకున్న వీరికి కనబడదు ఒక వ్యక్తి ఇంటి నిర్మాణం అనుమతి గురించి పత్రాలు సమర్పించి నెల నుంచి తిరుగుతున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఒక పంచాయతీ కార్యదర్శి మల్లెపల్లి గ్రామపంచాయతీలో దాదాపు 6 సంవత్సరాలు పనిచేయడం ద్వారా తెలుస్తుంది మల్లెపల్లి గ్రామపంచాయతీ లోని ఆదాయం. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గ్రామపంచాయతీ అధికారులకు ఎవరికి కనబడదు. కఠిన చర్యలు తీసుకుంటాం మల్లె పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ఇలాంటి సంఘటనలు తమ దృష్టికి తీసుకు రాలేదని ఒకవేళ తమ దృష్టికి వచ్చినచో వారిపైచట్ట పరమైన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

# పోలీస్ కుటుంబాలకు ఆర్థిక భరోసా

అనారోగ్యం తో మరణించిన పోలీసు కుటుంబాలకు చేయూత చెక్కు అందజేత పోలీస్ శాఖ అన్ని రకా ుగా అండగా నిలుస్తామని భరోసా -జిల్లా ఎస్పీ

నల్లగొండ అక్షర కలం/ ప్రతినిధి :

కనగల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ సైదులు గార్ల సతీమణి లక్ష్మీ గార్లకు చేయూత ద్వారా రెండు లక్షల రూపాయలు అందజేసి జిల్లా యస్.పి గారు పరామర్శించి, మాట్లాడుతూ చనిపోయిన పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని, ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ధి సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషి చేస్తామని చెప్పారు. పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో చనిపోయిన పోలీస్ కుటుంబాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# కేంద్ర కార్మిక రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో మోడీ డోనాల్డ్ ట్రంప్ ల దిష్టిబొమ్మ దహనం



అక్షర కలం /భద్రాచలం

భారత ప్రజల ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్ర మోడీ విధానాలను నిరసించండికేంద్ర కార్మిక, రైతు, కూలీ సంఘాల ఆధ్వర్యంలో మోడీ,డోనాల్డ్ ట్రంప్ ల దిష్టిబొమ్మ దహనం భారత ప్రజల ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్ర మోడీ సామ్రాజ్యవాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, రైతు,కూలీ సంఘాలు ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ, డోనాల్డ్ ట్రంప్ ల దిష్టిబొమ్మలను భద్రాచలం పట్టణం అంబేద్కర్ సెంటర్ నందు దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు భద్రాచలం పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ నర్సారెడ్డి, యునైటెడ్ కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు కెచ్చల రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి, ఏఐటీయూసీ పట్టణ నాయకులు మా రెడ్డి శివాజీ, ఐ ఎన్ టి యు సి డివిజన్ నాయకులు ఎస్ శ్రీనివాసరావు లు మాట్లాడారు. అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశము నుండి దిగుమతు చేసే సరుకులపై తారికుల పేరుతో అధిక సెస్సులు వేస్తామని బెదిరింపులు కు పాల్పడుతున్నా భారత ప్రధాని నరేంద్ర మోడీ నోరు మెదపకపోవడం దారుణమని అన్నారు. అమెరికా దిగుమతి చేసుకుంటున్న భారత వస్తువులపై 50 శాతం పన్ను వేస్తామని చెబుతుందని అదే జరిగితే భారతదేశం నుండి ఎగుమతి చేసే అన్ని రకాల వస్తువులు ధరలు పెరుగుదల జరుగుతుందని దానివల్ల ఎగుమతులు చేసేటటువంటి వ్యవసాయ ఆధారిత పంటలు, పారిశ్రామిక రంగం తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు.భారత ప్రజల ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెట్టేందుకు మోడీ సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నకిరికంటి నాగరాజు, రాయల రాములు, మురళీకృష్ణ, ఏఐఎఫ్ నాయకులు సాధన పల్లి సతీష్ కుమార్, గుంజ రామారావు, పి డి ఎస్ యు డివిజన్ నాయకులు శివ ప్రశాంత్, టి యు సి ఐ నాయకులు భాస్కర్, ఐ ఎన్ టి యు సి నాయకులు మాధవరావు, చంద్రరావు, రామ్మోహన్ రెడ్డి, సాంబయ్య, ఐద్వా నాయకులు యుస్తెల జ్యోతి, సత్యవతి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కోరాడ శ్రీనివాస్, ఆవాజ్ పట్టణ నాయకులు ఎస్ డి ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

# డివి శంకరరావును అభినందించిన డాక్టర్ తెల్లం వెంకట్రావు

అక్షర కలం/ భద్రాచలం

నాలుగు బంగారు పతకాలు సాధించిన సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడుని అభినందించిన ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు.లి కేరళ రాష్ట్రంలో ఆగస్టు 2 నుంచి 7 వరకు జరిగిన జాతీయస్థాయి మాస్టర్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో నాలుగు బంగారు పతకాలు సాధించిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డివి శంకర్రావు ను భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 73 సంవత్సరాల వయస్సు మాత్రమే కాకుండా బైపాస్ సర్జరీ అయినప్పటికీ లెక్కచేయకుండా సిటీ స్టైల్ జిమ్ కోచ్ జీవి రామిరెడ్డి మరియు ఇంటెన్సివ్ ట్రైనర్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ ల కటోర శిక్షణలో ఆరు నెలల అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో నాలుగు బంగారు పతకాలు సాధించి



అక్టోబర్ నెలలో సౌత్ ఆఫ్రికా లో జరిగే ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించడం జరిగింది. అంతేకాకుండా పవర్ లిఫ్టింగ్ ఆఫ్ ఇండియా చరిత్రలో ఒక బైపాస్ సర్జరీ జరిగిన వ్యక్తి జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ లో బంగారు పతకాలు సాధించిన దాఖలాలు లేవు. ఇది ఒక మెడికల్ మిరాకిల్ అని ఈ సందర్భంగా తెలియజేశారు.

# సీతారామచంద్రస్వామి దేవాలయానికి ఐఎస్ఓ వారి గుర్తింపు





అక్షర కలం /భద్రాచలం

భద్రాచల శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానానికి %×ూా% వారి గుర్తింపు లభించింది.19001 ప్రమాణ స్థాయిలను పాటించేటటువంటి మరియు 22000 ఆహార భద్రత నిర్వహణ స్థాయి పాటించే గుర్తింపు లభించింది. దీనిని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ చేతులు మీదుగా దేవస్థానం కార్య నిర్వహణ అధికారి శ్రీమతి ఎల్ రమాదేవి అందుకున్నారు. ఈ సర్టిఫికెట్ను %×ూా% డైరెక్టర్ శ్రీ శివయ్య గారు అందించారు.

# పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు...

అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

అక్షర కలం:ఏన్కూరు/తల్లాడ,



పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.బుధవారం ఏన్కూరు, తల్లాడ మండలాల తహసిల్దార్ కార్యాలయాలు, ఏన్కూరు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల స్థితిగతులు, భూ భారతి పోర్టల్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులపై నోటీసులు జారీ చేసి భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం వాటి పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.అనంతరం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో డైనింగ్ హాలు, కిచెన్ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అదనపు కలెక్టర్ తనిఖీల సందర్భంగా తహసీల్దార్లు సిహెచ్. శేషగిరిరావు, వి. సురేష్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ కు నో చెప్పాలి

**నల్లగొండ, అక్షర కలం/ ప్రతినిధి :**




యువత, విద్యార్థులు డ్రగ్స్ కు నో చెప్పాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. బుధవారం నాగార్జున ప్రభుత్వ కళాశాల ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ విభాగాలు మరియు కళాశాల ఆంటీ డ్రగ్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శరత్ సి పవార్ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకుంటే మన దేహంలో డోపమైన్ అనే రసాయన పదార్థం విడుదలయి ఎంతో సంతోషం కలుగుతుందని దాని వల్ల ఒకసారి డ్రగ్స్ తీసుకున్న వ్యక్తి పదే పదే డ్రగ్స్ తీసుకుని







ఆనంద డోలికల్లో తెలియాడాలని తహ తహలాడుతాడని అన్నారు. దాని వల్ల నరాల్లోని కణజాలం దెబ్బతింటుందని అన్నారు. గంజాయి, కోకైన్ లాంటి డ్రగ్స్ తీసుకోవడం వల్ల క్రమంగా భౌతిక స్పందనలు కలగవని తెలిపారు. ఒకసారి డ్రగ్స్ తీసుకుంటే ఇక జన్మలో మానలేరని అందుకే డ్రగ్స్ కు నో చెప్పాలని అన్నారు. స్నేహితులవల్ల, దగ్గరి వ్యక్తుల వల్లనే డ్రగ్స్ అలవాటు అవుతాయని అందుకే వాళ్లకు నో చెప్పడానికి వెనుకాడవద్దని అన్నారు. డ్రగ్స్ తీసుకున్నవారి జీవితం నాశనం అవుతుందని, వారిని ఎవరూ గౌరవించరని అన్నారు. డ్రగ్స్ తీసుకొని కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ లో ఉద్యోగాలు కూడా రావనే విషయం యువత గమనించాలని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని అన్నారు. మత్తు పదార్థాల బారిన పడకుండా మంచి లక్ష్యాన్ని ఏర్పర్చుకొని జీవితంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. కష్టపడితే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని అన్నారు. మీ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నా, మిమ్మల్ని ఎవరైనా డ్రగ్స్ తీసుకోవాలని ఒత్తిడి చేసినా పోలీసుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఇవే కాకుండా విద్యార్థులకు సంబంధించిన ఎలాంటి సమస్యలనైనా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ కళాశాలలో రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వీటిపైన పోలీసులు దృష్టి పెట్టాలని అన్నారు. కళాశాల మైదానంలో విద్యార్థులు ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ ద్వారా నేర్చుకున్న మంచి విషయాలను గ్రామాలకు చేరేలా చేసి గ్రామాలను చైతన్య పర్చాలని అన్నారు. డ్రగ్స్ ద్వారా సమాజం ఎలా దిగజారుతుందో తెలుసుకోవాలని అన్నారు. డ్రగ్స్ లేని జిల్లాగా మన జిల్లాను తీర్చిదిద్దడానికి విద్యార్థులు కృషి చేయాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో ఆంటి డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఎస్పీ శివరామ్ రెడ్డి, సి ఐ. రాఘవరావు, ఎస్సై వై. సైదులు, ఆంటి డ్రగ్స్ కమిటీ కన్వీనర్ సుధాకర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. బొజ్జ అనిల్ కుమార్, డా. ఎ. మల్లేశం, వెంకట్ రెడ్డి, కోటయ్య, సావిత్రి, శివరాణి, ఇతర అధ్యాపకులు, ఎన్ సి సి కేడేట్స్, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

**అక్షర కలం /ప్రతినిధి :**

కేంద్రం ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తూ, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చి రైతులకు ప్రజలకు ప్రజా పంపిణీ పథకాలను పాతరవేసే దిశలో అడుగులు వేస్తున్నందుకు నిరసనగా ఈనెల 13వ తేదీన దేశవ్యాప్త పిలుపులో భాగంగా నల్లగొండ సుభాష్ విగ్రహం దగ్గర ఏఐటీయూసీ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ,తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజా రామచంద్రం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచి పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయటం సిగ్గుచేటని అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు సమూలంగా మార్చివేస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి పెట్టుబడిదారులకు కార్పొరేటర్లకు అనుకూలంగా తీసుకొని రావడం విచారకరమని అన్నారు. దేశ సంపద సృష్టించే కార్మిక వర్గము నోట్లో మట్టి కొడుతూ ధనవంతుల కొమ్ముగాస్తున్న ప్రభుత్వం విధానాలు తిప్పి కొట్టాలని అన్నారు. నిత్యావసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే నియంత్రించడం చేతగాని ప్రభుత్వం అమెరికా భారత వస్తువులపై సుంకాలు పెంచుతున్న నిమ్మకు నేరెత్తినట్లు వివరిస్తుందని ఆరోపించారు. అమెరికా సామ్రాజ్యవాద అడుగులకు మడుగులొత్తుతూ దేశ సార్వభౌమత్వాన్ని ట్రంప్ కు తాకట్టు పెట్టే విధంగా ప్రధానీ విధానాలు ఉన్నాయని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేస్తూ రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పోరేటు నినాదంతో దేశవ్యాప్తంగా పోరాటాలను తీవ్రతరం చేస్తామని కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటాలు నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక చట్టాలను తక్షణమే



ఉపసంహరించుకోకపోతే వాటిని రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు. 8 గంటల పని విధానం రద్దుచేసి 12 గంటల పని విధానం తీసుకొచ్చి శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు రైతు కార్మిక వ్యతిరేక విధానాలు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గీతా పనివారల సంఘం జిల్లా కార్యదర్శి పబ్బు వీరస్వామి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కేవిస్ రెడ్డి కోశాధికారి దోనకొండ వెంకన్న, సహాయ కార్యదర్శి బరిగల వెంకటేష్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండమీద వెంకన్న, యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, గుండె రవి, శంకర్ ,లెనిన్, ఏం ముత్యాలు, నందం, సత్యనారాయణ రామకోటి, వెంకటయ్య దోటి పండరి , యూసుఫ్ మదార్, విజయ్ రెడ్డి, అక్కలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో కార్మిక కర్షకులు పోరాటాలకు సిద్ధం కావాలి

**కార్పొరేట్ ,మతోన్మాదం, సామ్రాజ్యవాదం పై ప్రజలు తిరగబడాలి.**

**ఎస్ కె యం, కార్మిక సంఘాల నేతల పిలుపు.**



**నల్లగొండ, అక్షర కలం / ప్రతినిధి :**

నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ మతోన్మాద సామ్రాజ్యవాద అనుకూల విధానాలపై కార్మికులు కర్షకులు బ్రిటిష్ దొరలను తరిమికొట్టడానికి ఇచ్చిన పిలుపు క్విట్ ఇండియా స్ఫూర్తితో సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం నల్గొండ సుభాష్ సెంటర్ లో మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య, రైతు సంఘం నాయకులు కుంభం కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలో ఉన్న ఈ 12 సంవత్సరాల కాలంలో కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టే విధానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. పేదరికం నిరుద్యోగం రైతాంగం కార్మికుల సమస్యలు పెరుగుతుంటే పట్టించుకోని మోడీ అంబానీ ఆదాని సేవలో తరిస్తున్నారని ఆరోపించారు. సామ్రాజ్యవాద దేశమైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇష్టం వచ్చినట్టుగా భారతదేశం పైన అవాకులు చవాకులు పేలుతుంటే, టారీఫ్ ల పేరుతో ఇష్టం వచ్చినట్టుగా పన్నులు వేస్తుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం ట్రంప్ కు భజన చేస్తూ సామ్రాజ్యవాదానికి లొంగిపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశ సార్వభౌమత్వం పై ఇంత దాడి జరుగుతున్న మోడీ ఎందుకు చలనం లేకుండా ఉన్నారని ప్రశ్నించారు. ప్రపంచ పెద్దన్నగా ట్రంప్ వ్యవహరిస్తూ అనేక దేశాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటుంటే భారత్ కళ్ళు అప్పగించి చూస్తుందని విమర్శించారు. స్వతంత్ర భారతదేశంలో ఇంత అసమర్ధ ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం, సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య,టౌన్ కన్వీనర్ అవుట రవీందర్, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ, జిల్లా నాయకులు మన్నెం బిక్షం, రైతు సంఘం జిల్లా నాయకులు ఊట్కూరి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, పోలే సత్యనారాయణ కోట్ల అశోక్ రెడ్డి అద్దంకి నరసింహ రామకృష్ణారెడ్డి, పాక మల్లయ్య, కందుల అశోక్ నాయకులు అంజయ్య తెలకపల్లి శ్రీను బి వెంకటరెడ్డి కె బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలీ ఏరియా ఆసుపత్రిలో నూతన ఫిజీయో థెరపీ చికిత్స యూనిట్ ప్రారంభం





**ప్రారంభోత్సవ ముఖ్య అతిథిగా జి.జి.హెచ్. మహేశ్వరం సూపరిండేంట్ బి. నాగేందర్:**

**హైదరాబాద్: ఆగష్టు 13,( అక్షర కలం):**

రంగారెడ్డి జీల్లా వనస్థలీ పురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నూతన ఫీజీయో థెరపీ చికిత్సా విభాగం అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా నూతన ఫీజీయో థెరపీ చికిత్సా విభాగ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి.జి.హెచ్ మహేశ్వరం సూపరిండేంట్ డాక్టర్ల్ బి. నాగేందర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వయోవృద్ధాప్యంలో వచ్చే నొప్పులకు పలు రకాల ఆర్థోపెటిక్, న్యూరలాజికల్, వ్యాధుల చికిత్స నిమిత్తం ప్రభుత్వ పరంగా అవసరమైన చికిత్సా పరికరాలు కొనుగోలు చేసి ఈ నూతన ఫీజీయో థెరపీ విభాగాన్ని రోగులకు అందుబాటులోకి తిసుకొచ్చామని పేర్కొన్నారు. వైద్యపరంగా రోగులకు అవసరమైన సౌకర్యాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం మరింత క్రృషి చేస్తామన్నారు. అనంతరం వనస్థలీ పురం ఏరియా ఆస్పత్రి సూపరిండేంట్ డాక్టర్ క్రృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, రోజు రొజుకు ఈ ఆసుపత్రికి రోగుల తాకిడి అధికమవుతున్నాయని, వారి చికిత్సలకు అనుగుణంగా ఇలాంటి ఫిజీయో థెరపి నూతన విభాగం ఏర్పాటు అవ్వడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఈ నూతన ఫిజీయో థెరపీ చికిత్సా విభాగ వైద్యులైన డాక్టర్ రూపేశ్ మామిడి ( పి.టి )మీడియాతో మాట్లాడుతూ, మెడిసిన్ లేకుండా వ్యాయామాల ద్వారనే చికిత్స అందించడమే ఈ ఫిజీయో థెరపీ ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. కదలికలు, కండరాల నొప్పులు, నరాల నొప్పులను ఎలక్ట్రికల్ పరికరాలైన టెన్స్ , ఐ.ఎఫ్.టి , ఎస్. డబ్లు. డి,ద్వారా మెరుగైన చికిత్స అందిస్తామ్మారు. అదేవిధంగా చికిత్సలో భాగంగా వేడి, చల్లదనం అందించడానికి హీటింగ్ ప్యాడ్స్ ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. గత కొంత కాలంగా ఆసుపత్రిలో ఎలక్ట్రిక్ పరికరాలు లేక కాస్త ఇబ్బందిగా ఉండేదని, ప్రస్తుతం అవసరమగు ఎలక్ట్రికల్ పరికరాలు ఏర్పాటు చేయుటలో సహకరించిన ఆసుపత్రి సూపరిండేంట్ డాక్టర్ బి.నాగేందర్ సార్ కి, ఏరియా సూపరిండేంట్ డాక్టర్ క్రిష్ణ సార్ కి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు ఫీజీయో థెరపీ డాక్టర్ రూపేశ్ మామిడి (పి.టి). ఇంకా ఈ కార్యక్రమంలో ఆసుపత్రికి చెందిన డాక్టర్లు, ఆల్ డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి లు నర్సులు తదితరులు పాల్గొన్నారు.

# మున్నేరు రిటైనింగ్ వాల్ వివాదం

**పరిహారం లేక భూములివ్వబోమన్న నిర్వాసితులు**

**ఎస్టీ కమిషన్ ముందు బాధితుల వినతి**

**నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యల భరోసా**

**ఎస్టీ కమిషన్ జాతీయ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ స్పందన**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**





ఖమ్మం నగరంలోని మున్నేరు పరివాహ ప్రాంతంలో జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణం కారణంగా భూములు, ప్లాట్లు, ఇండ్లు కోల్పోయే నిర్వాసితులు తమ ఆవేదనను ఎస్టీ కమిషన్ జాతీయ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం ద్వారా తెలియజేశారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మానికి వచ్చిన హుస్సేన్ నాయక్‌కు, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో కలిసి ఎన్ఎస్టీ గెస్ట్ హౌస్‌లో మున్నేరు బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ, సుమారు 50 ఎకరాల ప్రైవేటు భూములు, స్థలాలను స్వాధీనం చేసుకోవడానికి రెవెన్యూ శాఖ గుర్తింపు పూర్తి చేసిందని, ఇందులో 250 మందికి పైగా ప్లాట్ యజమానులు, ఇళ్ల యజమానులు ప్రభావితులుగా ఉన్నారని తెలిపారు. మున్నేరు ఒడ్డున భూముల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.3 కోట్ల నుండి రూ.4 కోట్ల వరకు ఉందని, ఆ మేరకు లేదా మూడింతల పరిహారంతోనే భూములు ఇవ్వగలమని స్పష్టం చేశారు. తక్కువ రేటుతో భూములు స్వాధీనం చేసుకోవడం తమ జీవనాధారంపై నేరుగా దాడి అవుతుందని, పరిహారంపై స్పష్టత లేకపోవడం తీవ్రమైన ఆందోళన కలిగిస్తోందని వాపోయారు. ప్రజా అవసరాల పేరుతో ప్రభుత్వం బలవంతంగా భూములు తీసుకోవడాన్ని అంగీకరించబోమని, “మా కుటుంబాలను వీధిన పడేస్తారా? చావనైనా చస్తాం, కానీ పరిహారం లేక భూములివ్వం” అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని, ఇప్పటికే కొందరు యజమానులు స్టే ఆర్డర్లు తెచ్చుకున్నారని వెల్లడించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన హుస్సేన్ నాయక్, నిర్వాసితుల సమస్యలను శ్రద్ధగా విని, తగిన విధంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సన్నీ ఉదయ ప్రతాప్ , నున్న రవికుమార్, రవి రాథోడ్, మందడపు సుబ్బారావు , గల్లా సత్యనారాయణ, మంద సరస్వతి, శ్యామ్ రాథోడ్, మోహన్ రాథోడ్,శామ్ రాథోడ్ , మేకల నాగేంద్ర, తడుపునూరి రవీందర్, వీరవల్లి రాజేషు, దార్ల మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల బీమా దరఖాస్తు గడువును పొడిగించాలి



ఫార్మర్స్ అగ్రికల్చర్ సొసైటీ చైర్మన్ గాలెంక ఇందిర

నాంపల్లి, అక్షర కలం/ ప్రతినిధి:

రైతుల బీమా గడువు దరఖాస్తు ఈనెల 13 తేదీ వరకు ముగుస్తుండటంతో చాలామంది రైతులు నేటికీ పట్టాదారు పాస్ బుక్కులు రాక వివిధ సాంకేతిక కారణాలతో ఇబ్బంది పడుతున్నారు. రైతుల బీమా దరఖాస్తు గడువును 20 రోజులు పెంచాల్సిందిగా ఫార్మర్స్ అగ్రికల్చర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు గాలెంక ఇందిర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు.

## పారదర్శకంగా ప్రజలకు న్యాయం అందించాలి...

కమిషనర్ సన్ ప్రీత్ సింగ్





అక్షర కలం (నర్సంపేట ఆగస్ట్ 13 )

పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు పోలీస్ అధికారులు పారదర్శకంగా న్యాయం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నల్లబెల్లి పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలకై పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు స్టేషన్ పోలీస్ అధికారులు పూలమొక్కలను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసులు సీపీకి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ తో పాటు కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సిసిటిఎన్ఎస్ విభాగాల పనీతీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, అనుమానితులు,కేడీ,డిసిలు, మిస్సింగ్, ఆస్తి నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతోపాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరి పై ఉందని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్బంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ, డీసీపీ చేతుల మీదుగా మొక్కలను నాటించారు. ఈ తనిఖీల్లో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్,నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, దుగ్గొండి సిఐ సాయి రమణ, నల్లబెల్లి, ఖానాపూర్ ఎస్.ఐలు గోవర్ధన్ పాల్గొన్నారు.

## నాగార్జున సాగర్, నందికొండ బీజేపీ టౌన్ అధ్యక్షులు ఎర్రబోయిన రాజు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర, ద్విచక్రవాహన ర్యాలీ

నాగార్జునసాగర్, అక్షర కలం/ ప్రతినిధి:

నాగార్జున సాగర్ హిల్ కాలనీ లో బుధవారం నాడు %దీజ% స్కూల్ వద్ద నుండి కెనాల్స్ మీదుగా, జూనియర్ కాలేజ్, బస్టాండ్ మరియు హిల్ కాలనీ బజార్ నుండి, పైలాన్ కాలనీ గాంధీబజార్ నుండి బైపాస్ మీదుగా జెన్ కో, పైలాన్ బస్టాండ్, పిల్లర్ వరకు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన నందికొండ బీజేపీ కార్యకర్తలకు,యూత్, స్థానిక ప్రజలకు, మరి ముఖ్యంగా విజయపురి టౌన్ పోలీస్ వారికి అందరికి, మా ధన్యవాదములు.జై భారత్. వందే మాతరం.ఇట్టి కార్యక్రమం లో కొమ్ము రాందాస్, గణేష్ తంగా రాజు, ఆత్మకూరు రమణయ్య, వావనగిరి జయమ్మ, సుమ తంగరాజు, పద్మారెడ్డి, కిన్నెర రమణమ్మ, మూడవత్ విక్రమ్ నాయక్, మరియు కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు, తదితరులు. పాల్గొన్నారు.



# మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్







## నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగం వ్యతిరేకంగా మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ...

నల్లగొండ, ప్రతినిధి:( అక్షర కులం ) ఆగస్టు 13

నషా ముక్త్ భారత్ అభియాన్ లో బాగంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగం వ్యతిరేకంగా మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా యువత మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల జరిగే నష్టాలు,వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణ కేంద్రంలోని యన్.జి కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థి దశలో మాదక ద్రవ్యాల మాయలో పడి జీవితం వృథా చేసుకోకూడదని, ఒక్కసారి డ్రగ్స్ వాడితే అది మెల్లమెల్లగా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. డ్రగ్స్ వాడకం వలన యువత యొక్క శారీరక, మానసిక ఆరోగ్య విచ్ఛిన్నం కావడంతో పాటు, ఆర్థిక సమస్యలు,సమాజంలో గౌరవం లేకుండా పోతుందని అన్నారు.సంతోషం కొరకు సేవించడం అలవాటుగా పడి డ్రగ్స్ బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు.మత్తుపదార్థాల బారిన పడడం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని అన్నారు.కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో యువత పాలుపంచుకోవాలని,డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు,తమ దృష్టికి నిషేధిత డ్రగ్స్ సరఫరా మరియు వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే తెలియజేయాలని సూచించారు.యువత ఒక్కసారి డ్రగ్స్ సేవించి పట్టుబడి కేసు నమోదు అయితే భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు మరియు ఏ ఇతర దేశాలకు కూడా వెళ్ళే అవకాశం దొరకక జీవితం అంధకారంలోకి వెళు ందని తెలియజేశారు. ఎవరైనా గంజాయి డ్రగ్స్ సేవిస్తే %చీణూూ% చట్టం-1985 తో పాటు ఇతర చట్టాల ప్రకారం కఠిన కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను క్రయవిక్రయాలు,సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే, టోల్ ఫ్రీ నెంబర్ 8712670266 కు సమాచారం తెలపాలని కోరారు. అనంతరం మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియశీలా భాగస్వామి అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తాను అని డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, టూ టౌన్ సిఐ రాఘవరావు, 2 టౌన్ ఎస్సై సైదులు, కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, అధ్యాపకులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయంలో జగదీష్ రెడ్డి దద్దమ్మ మంత్రి

## 10 సంవత్సరాలు జిల్లా అభివృద్ధికి చేసింది శూన్యం

## బీఆర్ఎస్ ది ఫామ్ హౌస్ పాలన... కాంగ్రెస్ ది ప్రజా పాలన

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చారిత్రాత్మక పథకాలు

## ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

నల్లగొండ, ప్రతినిధి:( అక్షర కలం ) ఆగస్టు 13

సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్ రెడ్డి దగాకోరు మాటలు ప్రజలు ఎవరు నమ్మడం లేదని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు.బుధవారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి క్యాంపు కార్యాలయంలో నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసలైన దద్దమ్మలు బీఆర్ఎస్ పార్టీ పాలకులని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో 10 సంవత్సరాలు మంత్రిగా ఉన్న గుంటకండ జగదీష్ రెడ్డి జిల్లా అభివృద్ధికి చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. మంత్రులపై జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ పార్టీ పూర్తిగా ప్రజావిశ్వాసం కోల్పోయిందని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కుటుంబ పాలన సాగించి బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోవడం లేదని విమర్శించారు. బిఆర్ఎస్ ది ఫామ్ హౌస్ పాలన... కాంగ్రెస్ పార్టీది ప్రజా పాలన అనీ కొనియాడారు. మీ పార్టీ కల్వకుంట్ల కవితనే చెప్పింది నువ్వు లిల్లీపుట్ అంటూ చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని అన్నారు. నల్గొండ నియోజకవర్గంలో సొంత నిధులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోటి రూపాయలు కాలువలో చెట్లను, పూడికను తీయించారని అన్నారు. ఎస్ఎల్బీసీ,డిండి, నక్కల గండి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే అన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మేం చేసిన అభివృద్ధి.. మీరు చేసిన అవినీతిపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. మా మంత్రులు జిల్లా సర్వతో ముఖ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారనీ అన్నారు. భూ దందాలు, ఇసుక దందా కంకర దందా చేసిన వాళ్లు గత బిఆర్ఎస్ పాలకులని పేర్కొన్నారు. మా మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ప్రజలే బిఆర్ఎస్ నాయకులపై తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. ఉత్తంకుమార్ రెడ్డి మంత్రి అయిన తర్వాత అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, సన్న బియ్యం వస్తున్నాయని అన్నారు. కారులైన ప్రతి ఒక్కరికి ఇందిర ఇండ్లు మంజూరు అవుతున్నాయని పేర్కొన్నారు. ఇలా ఎన్నో చారిత్రాత్మక పథకాలను అమలు చేస్తూ ముందుకు పోతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దేనిని స్పష్టం చేశారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డిలను విమర్శించే స్థాయి జగదీష్ రెడ్డికి లేదని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నల్గొండ జిల్లాలో పెండింగ్ లో పెట్టిన సాగు తాగు నీటి ప్రాజెక్టులన్నింటినీ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు విడుదల చేసి పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాడని అన్నారు. డిండి, ఏదుళ్ళ ప్రాజెక్టుకు వేల కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే కాంగ్రెస్ పార్టీ అన్ని ప్రాజెక్టులను ప్రారంభించిందని వెల్లడించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. బిఆర్ఎస్ హయంలో బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, కత్తుల కోటి, రామ్ రెడ్డి, మామిడి కార్తీక్ పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955